# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 15-6-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:242 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

గద్దరు పేరున సినిమా
పెద్ద పురస్కార నిధులు విడుదల చేయన్
ఖద్దరునకు,గద్దరునకు
నొద్దిక కుదురుటను నే మహోన్నత మనెదన్ !!

(గద్దర్ పేరున యిచ్చే
పురస్కారాలకు నిధులు విడుదల)

-రాధశ్రీ
సెల్:9494481210

**బుర్క**

విశ్వశాంతి రెక్కలను
విరిచే యుద్ధకాంక్ష
ప్రపంచమే విధ్వంసం
పెట్టకుంటే ఆంక్ష
నర యుద్ధం ఏదైనా
నశించేది ప్రాణులే
అభివృద్ధి నాగరికత
అన్నీ భస్మ మానులే

-వేల్పుల నారాయణ
9440433475

# ఘనంగా తెలంగాణ గద్దర్ సినీ అవార్డుల వేడుక

హైదరాబాద్, జూన్ 14: తెలంగాణ గద్దర్ సినీ అవార్డుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (FDC) చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీష్ కలిసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా గద్దర్ సినీ అవార్డులపై ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకలో సినీ పరిశ్రమ ప్రముఖులు, కళాకారులు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించింది. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోహీరోయిన్లతోపాటు ప్రముఖులు భారీ ఎత్తున వచ్చారు. ఈ ప్రదానోత్సవంలో విజేతలకు భారీ ఎత్తున నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున కసరత్తు చేసిన సంగతి తెలిసిందే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టాలీవుడ్ చిత్రాల్లో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి.. నంది అవార్డుల పురస్కారాన్ని అందజేసేవారు. అయితే 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయింది. అదే సమయంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయింది. అనంతరం 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ గెలిచింది. ఈ దాదాపు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో టాలీవుడ్‌లో విడుదలైన ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి పురస్కారాలు అందించే కార్యక్రమం ఒక్కటి జరగలేదు.

పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. గద్దర్ పేరిట సినిమా పురస్కారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఇచ్చిన హామీ మేరకు గద్దర్ పేరిట సినిమా పురస్కారాలు అందజేసేందుకు చర్యలు చేపట్టింది.

అందులోభాగంగా సహజ నటి జయసుధ అధ్యక్షతన 2024 ఏడాది ఉత్తమ చిత్రాల ఎంపిక కోసం జ్యూరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అన్ని క్రాఫ్ట్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గద్దర్ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇక రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి అంటే.. 2014 నుంచి 2023 వరకు ఉత్తమ చిత్రాలను మూడు కేటగిరిగా ఎంపిక చేశారు. ఈ కమిటీకి ప్రముఖ నటుడు మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్ చైర్మన్‌గా వ్యవహరించారు.

## సీఎంతో శ్రీనుబాబు భేటీ.. పీసీసీలో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు

పెద్దపల్లి, జూన్ 14:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో భేటీ అయ్యారు. పిసిసి జనరల్ సెక్రటరీగా నియమించినందుకు సీఎంకు పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలియజేసారు. తనపై నమ్మకం ఉంచి పిసీసీ లో చోటు కల్పించారని, పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే మురా గోపాల్

హైదరాబాద్, జూన్ 14: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే మురాగోపాల్ సూచించారు. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ), జనహిత ఫౌండేషన్, కివ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే మురా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం మురా గోపాల్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వాతావరణ మార్పుల కారణంగా వచ్చే వ్యాధులతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని అన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ వైద్య సంస్థలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు అందించే వైద్య సేవలను మురికివా డల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి బీపీ, షుగర్, గైనిక్, ఆర్థోపెడిక్, కంటిపరీక్షలు, న్యూరో తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## నమ్మించి వృద్ధురాలి నగలు చోరీ..

కరీంనగర్, జూన్ 14: తాను పంచాయతీ కార్యదర్శిని, మీ గ్రామానికి కొత్తగా బదిలీపై వచ్చానని, నీకు రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని గుర్తు తెలియని వ్యక్తి వృద్ధురాలిని నమ్మించి ఆమె వద్ద ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో జరిగింది. ఎస్సై వంశీ కృష్ణ కథనం మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మండలం, నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన గోలి వజ్రమ్మ(80) అనే వృద్ధురాలు తన కూతురు ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తన స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. వృద్ధురాలి ఆరోగ్యం బాగా లేకపోవడంతో గంగాధరలో డాక్టర్ కు చూపించుకోవాలని అనుకుంది.గంగాధర బస్టాండ్ లో బస్సు దిగి ఆసుపత్రి వైపు నడుచుకుంటూ వెళ్లుతోంది. మార్గం మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి వృద్ధురాలి వద్దకు వచ్చి తాను పంచాయతీ కార్యదర్శి అని, గ్రామానికి కొత్తగా బదిలీపై వచ్చానని, రూ. 4వేల పెన్షన్ ఇప్పిస్తానని వృద్ధురాలిని నమ్మించాడు.

పెన్షన్ రావడానికి ఫోటో తీసుకోవాలని, ఫోటో తీయాలంటే ఒంటిపై నగలు ఉండకూడదని వృద్ధురాలికి సూచించాడు. దీంతో దుండగుడి సూచన మేరకు తన మెడలో ఉన్న తులం బంగారు గొలుసు, 12 గురిజల చెవి కమ్మలు, రూ.ఒక వెయ్యి నగదు తీసి గుర్తు తెలియని దుండకుడికి ఇచ్చింది.

## సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా మేకలతండా యువకుడు వరప్రసాద్ ఎంపిక

హైదరాబాద్, జూన్ 14: ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని మేకలతండాకు చెందిన బానోత్ రామ్మూర్తి -విజయ దంపతుల కుమారుడు లక్ష్మీ వరప్రసాద్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్)గా ఎంపికయ్యాడు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఫలితాలను శుక్రవారం వెల్లడించింది. ఈ ఫలితాల్లో లక్ష్మీవరప్రసాద్ 256వ ర్యాంక్ సాధించాడు.

లక్ష్మీవరప్రసాద్ కారేపల్లిలోని హోలీ ఫెయిత్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో డిగ్రీ, సోషియాలజీలో పీజీ పూర్తి చేశాడు. యుపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరచడంపై కారేపల్లి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తూ లక్ష్మీ వరప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

మారుమూల గిరిజన తండా అయినప్పటికీ బానోత్ రామ్మూర్తి తన ఇద్దరు కూతుళ్లను ఎంబీబీఎస్ చదివించడం, ప్రస్తుతం సీఏపీఎఫ్‌కు ఎంపిక కావడంపై మేకలతండా వాసులు అభినందనలు తెలిపారు.

## ఏసీపీకి అవార్డు.. గవర్నర్ చేతుల మీదుగా అందజేత

పెద్దపల్లి, ఆజూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణకు బెస్ట్ మోటివేటర్ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అందజేశారు.

శనివారం హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణకు అవార్డు అందించారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదాతలను ప్రోత్సహించారని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నివేదిక అందించి సిఫారసు చేయడంతో ఏసీపీ కృష్ణ ను బెస్ట్ మోటివేటర్ అవార్డు కు ఎంపిక చేశారు.

రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణను పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలి

### -గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసినవారు తిరిగి స్వంత గూటికి రావాలి

### -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 14:(నేటినిజం ప్రతినిధి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..శనివారం వేములవాడ పట్టణంలోని తాటి కొండ రాజయ్య ఫంక్షన్ హాల్ లో వేములవాడ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్ 200 మందితో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది..వారికి ప్రభుత్వ విప్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలోకి రావడం మళ్ళీ తిరిగి స్వంత ఇంటికి వస్తున్నట్లుగా ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు తనను ఆకట్టుకున్నాయని, ప్రజల కోసం మరింతగా పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నానని, అనాడు కాంగ్రెస్ గెలిచిన 3 ఎంపీటీసీ లో తను ఒకడినని గుర్తు చేశారు.. కాంగ్రెస్ పార్టితో తనకు విడదీయరాని అనుబంధం పెనవేసుకుందిని కట్కూరి శ్రీనివాస్ పేర్కొన్నారు.ప్రభుత్వ విప్ మాట్లాడుతూ× ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్నని అన్నారు..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టి పేద ప్రజలకు అనేక పథకాలను రూపకల్పన చేసిందని తెలిపారు.. కొత్త పాత అనే తేడా లేకుండా కలసిగట్టుగా పని చేస్తు ముందుకు పోవాలన్నారు..

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలన్నారు.. గత ప్రభుత్వాలు పేద ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడ అమలు చేయలేదన్నారు. అభివృద్ధి కి రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం అన్నారు..గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి వేర పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని వారందరు తిరిగి స్వంత గూటికి రావాలని పిలపునిచ్చారు. చేరిన వారిలో కాముటాల వేణు,కముటల రాజు, తాటికిండ అనిల్, ఎర్రబెల్లి రాజశేఖర్, వంగర కిరణ్ ఉన్నారు..ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజ్యం, కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కాచ్చకాయల ఎల్లయ్య,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధైత కుమార్, కృష్ణ, నాగరాజు, తోట రాజు పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లహరి,నాయకులు,కూరగాయల కొమురయ్య,బింగి మహేష్,పుల్కమ్ రాజు, గూడూరి మధు, పాత సత్యలక్ష్మి,ఫిర్ మహ్మద్,భాశెట్టి రవీందర్,పులి రాంబాబు, ఇప్పపుల అజయ్, ముకుంద రెడ్డి,ఎర్ర శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, కార్యకర్తలు తదితరాలు ఉన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ లో 1846 కేసుల పరిష్కారం

### -జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

### -లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో కృషి చేసిన పోలీస్అధికారులను,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, జూన్ 14:(నేటి నిజం ప్రతినిధి): రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి జూన్ 14 శనివారం రోజున నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో జిల్లా పరిధిలో రాజీ మార్గమే రాజమార్గంగా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహనా కల్పించి లోక్ అదాలత్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో 1846 కేసులు పరిష్కరించడం జరిగిందని, కేసులను పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని,కోర్టు కనిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.పోలీస్ అధికారులను,కోర్టు కానిస్టేబుల్లను ప్రతి రోజు మానిటరింగ్ చేస్తూ కేసుల పరిష్కరంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య ని, కోర్ట్ మానిటరింగ్ ఎస్.ఐ లు శ్రవణ్ యాదవ్, రవీంద్ర నాయుడులను ప్రత్యేకంగా అభినందించారు.

# కుంటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న !

(15 జూన్ "ప్రపంచ పితృ దినోత్సవం" సందర్భంగా)

కుటుంబ వృక్షానికి కనిపించే కాండం అమ్మ అయితే కనిపించని తల్లి వేరు నాన్న. కుటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న. సంతానాభివృద్ధికి మార్గదర్శి తండ్రి. కుటుంబ గౌరవ దీపానికి చమురు నాన్న. పుస్తక జ్ఞానం లేకపోయినా లోకజ్ఞానం బోధించే మేధావి నాన్న. నాన్న వేలు పట్టుకొని నడక, నడత నేర్పిన పిల్లలు రేపటి తరానికి బాధ్యత కలిగిన పౌరులుగా ఎదుగుతారు. నాన్న భుజం వంశ భారాన్ని మోసే అలసట ఎరుగని వాహనం. కుటుంబ దేహానికి వెన్నెముక నాన్న. అమ్మతో కలిసి అమృతాన్ని వితరణ చేసే అమాయక త్యాగజీవి నాన్న. నాన్న ఓ ఆత్మీయ నేస్తం, ఓ ఆపన్నహస్తం. నాన్న జీవితం కుటుంబ దేహానికి రక్షణ కవచం. తండ్రి త్యాగం అనన్య సామాన్యం, ప్రశంస కోరని జీవితం. పిల్లల కంటికి రెప్ప నాన్న. బోధనలో ఓ మౌన రుషి. సాధనలో నైపుణ్య అనంత శక్తివంతుడు. నాన్న చెమట ఇంటి దీపానికి చమురు, కాలి బూడిదలుతూ తరిగే నూలు వత్తి. నాన్న మనసు దూదంత మెత్తన, పాలంతో తెల్లన. అవసరమైతే ఆయన ఆవేశం పిల్లలపై కుమ్మరించే శ్రేయో వర్షం. కుటుంబ లతకు పందిరి నాన్న. ఎదిగే సంతాన మొక్కలకు తనో ట్రీగార్డ్. నాన్న శ్వాస కుటుంబ క్షేమమే. కుటుంబ కాయానికి నాన్నే ప్రాణవాయువు. తను కరుగుతూ కుటుంబంలో వెలుగులు పంచే కొవ్వత్తి నాన్న. నాన్న జీవితం కుటుంబ సంక్షేమానికే అంకితం. ప్రేమల ఊటబాయి, అనురాగ బంధాల అక్షయపాత్ర నాన్న. తన తనువు అలసిపోయినా, తన పిల్లల నవ్వుల వర్షంలో శక్తిని తిరిగి పుంజుకొని బేషరతుగా సర్వస్వం ధారపోసే నాన్న జీవితం హిమాలయ శిఖరమంత మహోన్నతం. అయిన జీవితం ఓ ఆదర్శ దీపస్తంభం. పిల్లల పెంపకంలో ఓ పరిపాలనాదక్షుడే కాదు, పిల్లలు దారి తప్పినపుడు ఆయన ఓ చండశాసనుడు కూడా.

ప్రపంచ పితృ దినోత్సవం-2025:

నాన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట జూన్ మాసంలో మూడవ ఆదివారం రోజున, అనగా 15 జూన్ 2025న "ప్రపంచ పితృ దినోత్సవం" లేదా "వరల్డ్ ఫాదర్స్ డే" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. మన హిందూ సమాజంలో కుటుంబానికి పెద్ద దిక్కు నాన్న. అమ్మ నాన్నలు ఆది దేవతలు, అలసిపోని ధన్యజీవులు. కుటుంబ బండికి రెండు చక్రాలు అమ్మానాన్నలు. కుటుంబ బతుకు బండిలో పయనించే చిన్నారులు పిల్లలు. నాన్న త్యాగాలను గుర్తు చేసుకోవడం, వారి కాళ్లు కడిగి నెత్తిన పోసుకొని, మనసారా కృతజ్ఞతలు తెలియజేయడం, పుష్ప మాలలతో కొలుచుకోవడం, కానుకలు అందజేయడం, కుటుంబమంతా కలిసి గడపడం, నాన్నతో కలిసి సంతోషంగా గడపడం, చిన్ననాటి జ్ఞాపకాల మూట అయిన ఆల్బమ్ చూసుకుంటూ బాల్యాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రపంచ పితృ దినోత్సవ వేదికలు పని చేస్తాయి. రెక్కలొచ్చిన బిడ్డలు జీవనోపాధులను వెతుక్కుంటూ వెళ్లి పోవడాన్ని చూస్తూ, గుండె నిండా కన్నీటిని దాచుకొని, వీడ్కోలు చేప్పే నాన్న మనో లోతులు ఎవరికీ అందనంత దూరం. పాశ్చాత్య సంస్కృతిలో నాన్నను కలిసే రోజుగా పితృ దినోత్సవం ఉపయోగపడినా, భారతీయ సంస్కృతిలో నాన్నను మరిచిన రోజుండదు, తలవని క్షణ ముండదు.

అమ్మానాన్నలు ఆది దేవతలు:

అమ్మ జన్మనిస్తే, నాన్న ఆ జీవితానికి పరమార్థం ప్రసాదిస్తాడు. అమ్మ ఇంటిలో తొలి అడుగులు వేయిస్తే, నాన్న ప్రగతి పథం చూపు మార్గదర్శి. అమ్మ తొలి పలుకులు నేర్పితే, నాన్న జీవిత పాఠాల విలువల రసం నూరి పోస్తాడు. నాన్న లేనిదే పుట్టుక లేదు. అమ్మనాన్నల అన్యోన్యతే పిల్లల సంతోషాల కోవెల. ఆది గురువు అమ్మ, లోక జ్ఞాన బోధకుడు నాన్న. నాన్న స్థానం ఎవరూ భర్తీ చేయలేని నిరుపమాన అద్వితీయ పాత్ర. నాన్న లేని ఇల్లు గాఢాంధకారం. చీకట్లను పారద్రోలే ఉషోదయ కిరణం నాన్న. కుటుంబ పుస్తకంలో నాన్నే అక్షరం, పదం, భావం. నాన్న త్యాగానికి తత్సమాన్ని లేదు, నాన్న పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. తండ్రి మదిలో పిల్లలు మెదలని రోజుండదు. పిల్లలు తింటే నాన్న కడుపు నిండుతుంది. ఆపదలో అమ్మ అందరి ముందు కన్నీరు పెడితే, నాన్న తెర వెనుక దుఃఖిస్తాడు. తండ్రి కంటికి కునుకుండదు, పురుషుడి జన్మకు నాన్న పదమే పరిపూర్ణం. పిల్లల రెక్కలకు ఎగరడం నేర్పే బుద్ధిజీవి నాన్న. నవ్వుల పరదాలతో బాధల్ని కప్పేసి, కన్నీటిని చెమటగా మార్చి, తన వారి కోసం జీవించే ధన్యజీవి పిత. నాన్న హృదయం ఆకాశమంత మహోన్నతం, సాగరమంత లోతైన అవయవం.

నాన్నే మన సూపర్ హీరో :

నాన్న రుణం తీర్చుకోలేనిది. నాన్న అయిన తర్వాతనే నాన్న విలువ తెలుస్తుంది, ఆయన మానసిక స్థితి అర్థం అవుతుంది. బాధ్యత వలలో చిక్కినా, నిబ్బరంగా కనిపిస్తూ, సవాళ్లను అధిగమిస్తూ, రక్తాన్ని చెమటగా మార్చుతూ, అవిశ్రాంతంగా ఒంటరి పోరాటం చేసే త్యాగశీలా నాన్న. వృద్ధాప్యంలో పిల్లల ఉన్నతే నాన్నకు సంతోష కారణం. వృద్ధాప్యంలో నాన్నకు మనం ఊత కర్ర అవుదాం. మన ముందు నిలిచిన అమ్మానాన్నలు ఆదర్శ దైవాలు. నాన్నే మన సూపర్ హీరో, ఆయన లేని జీవితం జీరో. నాన్న లేని జీవితం చుక్కాని లేని నావ. అమ్మానాన్నలు సృష్టించిన హద్దులు లేని ప్రేమ సామ్రాజ్యంలో సంతోషంగా, స్వేచ్ఛగా, బాధ్యతతో ఎదగడం నేర్చుకుందాం. నిత్యం ఆది దేవతలను మదిలో తలుచుకొని దిన చర్యను ప్రారంభిద్దాం.

నేటి సమాజంలో అమ్మనాన్నలను ఇంట్లోంచా గెంటేయడం, వృద్ధాశ్రమాల్లో బలవంతంగా చేర్పించడం, పితృ దేవతను చులకనగా చూడడం లాంటి అమానవీయ పోకడలు చూడాల్సి రావడం దురదృష్టకరం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కన్సల్టెన్సీ సంస్థలకు చెందిన ఒక్కో ఇంజినీరు అధీనంలోని ప్రాజెక్టుల సంఖ్యపై పరిమితిని విధించిన ఎన్‌హెచ్‌ఏఐ

న్యూఢిల్లీ, జూన్ 14:జాతీయ హైవే ప్రాజెక్టుల్లో నాణ్యత, పర్యవేక్షణ యంత్రాంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆ ప్రాజెక్టుల నిర్మాణం లేదా నిర్వహణ కోసం పెట్టుకున్న కన్సల్టెన్సీ సంస్థలకు సంబంధించి ప్రతి ఇంజినీరుకూ గరిష్ఠంగా 10 ప్రాజెక్టులనే ఇవ్వాలంటూ భారత జాతీయ హైవే ప్రాధికరణ సంస్థ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా.. ఎన్‌హెచ్‌ఏఐ) తాజాగా ఓ పరిమితిని నిర్దేశించింది. స్వతంత్ర ఇంజినీరు, ప్రాధికరణ ఇంజినీరు లేదా సూపర్‌విజన్ కన్సల్టెంట్లుగా పనిచేసే కన్సల్టెన్సీ సంస్థలు ఒక డిజిగ్నేటెడ్ ఇంజినీరుకే అనేక ప్రాజెక్టుల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తున్నాయన్న విషయం పరిశీలనలో తెలియవచ్చింది.

స్పెసిఫికేషన్లను, కాంట్రాక్టు నిబంధనలను పాటించాల్సిన బాధ్యతను ప్రధానంగా కన్సల్టెంటు టీమ్ ఏదైనా ప్రత్యేక ప్రాజెక్టుకు నియోగించే (డిజిగ్నేటెడ్) ఇంజినీరు పర్యవేక్షిస్తుంటారు. అయితే చేతిలో ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు ఉంటున్న కారణంగా, ఇలా నియుక్తుడైన ఇంజినీరు తనకు కేటాయించిన బాధ్యతలను పూర్తి చేయలేకపోవచ్చు. ఈ స్థితిలో, ప్రాజెక్టు రాశి- వాసిల పర్యవేక్షణ ఉద్దేశం నెరవేరకుండా పోతోంది.

నేషనల్ హైవే ప్రాజెక్టులను హైబ్రిడ్ యాన్యుయిటీ పద్ధతి (హెచ్ఏఎమ్), ఇంజినీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతి.. ఈ రెండు పద్ధతుల్లోనూ అమలుచేయడంతో పాటు నిర్వహించే కన్సల్టెన్సీ సంస్థలను జారీ చేసిన మార్గదర్శకాల్లో సవివర క్లాజులను కూడా చేర్చారు. ఈ క్లాజుల్లో స్వతంత్ర ఇంజినీర్లు, ప్రాధికరణ ఇంజినీర్ల నియామకానికి సంబంధించిన నిబంధనలతో పాటు బాధ్యతల అప్పగింత నియమాలను పేర్కొన్నారు.

కన్సల్టింగ్ సంస్థకు చెందిన నియుక్తుడైన ఇంజినీరు నిర్ధారిత ప్రాజెక్టు స్థలాన్ని ప్రతి నెలా చూసి కన్సల్టెన్సీ, సివిల్ కాంట్రాక్టు నిబంధనలలో పేర్కొన్న విధంగా ఇన్‌పుట్స్‌ను నెలవారీ ప్రగతి నివేదికలో పేర్కొనాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క ఇంజినీరుకు ఎక్కువలో ఎక్కువగా పది ప్రాజెక్టుల పరిమితి నియమం 60 రోజుల తరువాత నుంచి అమలులోకి వస్తుంది. దీంతో ఈ వ్యవధి లోపల తగిన ఏర్పాట్లను చేయడానికి కన్సల్టెన్సీ సంస్థలకు వీలు కలుగుతుంది.

ఒక్కో ఇంజినీరుకు ప్రాజెక్టుల పరంగా గరిష్ఠ సంఖ్యపై పరిమితిని విధించడం నిర్వహణ కార్యకలాపాల్లో సామర్థ్యాన్ని పెంచడం ఒక్కటే కాకుండా హైవేల నిర్వహణతో పాటు ఆయా ప్రాజెక్టులను అధిక నాణ్యతతో అమలువరచడంలో కూడా తోడ్పడనుంది. దేశవ్యాప్తంగా నేషనల్ హైవేల్లో సురక్షిత, సరళతర, అంతరాయ రహిత ప్రయాణానుభూతికి కూడా మార్గాన్ని సుగమం చేయడంలో ఈ నిర్ణయం దోహదపడనుంది.

# ప్రమాద స్థలాన్ని సందర్శించిన ప్రధానమంత్రి... దుర్ఘటన నేపథ్యంలో అధికారులు, బృందాలతో భేటీ

అహ్మదాబాద్,జూన్ 14: అహ్మదాబాద్ లో జరిగిన విమాన దుర్ఘటనలో ఎంతోమంది చనిపోయినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సంతాపం వ్యక్తం చేశారు. తమ ప్రియతములను కోల్పోయిన కుటుంబాలకు ఆయన తన సానుభూతిని తెలిపారు. వారికి కలిగిన అంతేలేని వేదన, వారికి కలిగిన లోటు ఎలాంటిదో తాను అర్థం చేసుకోగలనని ఆయన అన్నారు.

అంతకు ముందు, శ్రీ మోదీ అహ్మదాబాద్ లో విమానం కూలిపోయిన ప్రదేశానికి వెళ్లి, అక్కడి స్థితిని స్వయంగా పరిశీలించారు. దుర్ఘటన అనంతర కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న అధికారులనూ, అత్యవసర ప్రతిస్పందన బృందాల సభ్యులనూ ఆయన కలుసుకున్నారు.

'అహ్మదాబాద్'లో జరిగిన విమాన ప్రమాదంతో మనమంతా స్తబ్ధులమయ్యాం. ఇంత మంది ఉన్నట్లుండి, గుండె పగిలే విధంగా మన మధ్య నుంచి దూరమైన బాధను గురించి చెప్పాలంటే నోట మాట రాదు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారికి ఎదురైన వేదనను మనం అర్థం చేసుకోగలం. ఈ విషాదం మిగల్చిన వెలితి ఏళ్ల తరబడి మనల్ని వెన్నాడుతుంది. ఓమ్ శాంతి."

"అహ్మదాబాద్ లో విమానం కూలిన స్థలాన్ని ఈ రోజున నేను చూశాను. విధ్వంసం సంభవించిన తీరు బాధాకరం. తదనంతర కార్యకలాపాల్లో అలసటనేదే ఎరుగకుండా విధులు నెరవేరుస్తున్న అధికారులను, సిబ్బందిని కలుసుకున్నాను. ఊహకైనా అందని ఈ పెనువిషాద ఘటనలో తమ ఆప్తులను కోల్పోయిన వారికి కలిగిన శోకం ఎంతటిదో.. వారికి నేను నా సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను" అని పేర్కొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాల్సిందే - ఎమ్మెల్యే కూనంనేని

హన్మకొండ, జూన్ 14:కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులనుఉల్లంఘిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కలలు కంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కమ్యూనిస్టుల మృతదేహాలను చూసి కేంద్రం భయపడుతోందని, పోలీసుల కాల్పుల్లో చనిపోయిన నంబాల కేశవరావు మృతదేహాన్ని ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్టప్రకారం కేసులు పెట్టాలని, 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఒక ఫ్యూడల్, గూండా, ఫాసిస్ట్ పాలనకు నిదర్శనం అని అన్నారు. మావోయిస్టులు లొంగిపోతామన్నా, చర్చలకు సిద్ధం అని ప్రకటించినా హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, కానీ ఒక్క నంబాల కేశవరావును చంపితే దేశంలో కోట్లాది మంది స్పందించారని, అదీ కమ్యూనిస్టులకు ఉన్న మానవతావాదానికి నిదర్శనం అని అన్నారు.

తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలి

కూనంనేని మాట్లాడుతూ 140 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని డిమాండ్ చేశారు. అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే అన్ని జిల్లాలకు సాగునీరు అందేదని చెప్పారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఇవ్వలేదని, నేడు పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, ప్రజలపై భారం మోపే కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలని అన్నారు. దాని నిర్వహణ కోసం ఏటా వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దు అని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు నేడు నోరు మూసుకున్నారని, తన మెదడును కరిగించి డిజైన్ చేశానని, కాళేశ్వరం కు అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ బాధ్యత ఇంజనీర్ లదే అని నేడు తప్పించుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టును మహారాష్ట్ర అనుమతి ఇవ్వలేదని, అందుకే కాళేశ్వరం కు మార్చామని హరీశ్ రావు అంటున్నారని, అలా అని జనాలను ముంచే ప్రాజెక్టు కడతారా అని ప్రశ్నించారు.

పేదలు లేని దేశంగా చూపాలని కుట్ర

భారతదేశం ఆర్థికంగా జపాన్ ను దాటి నాల్గవ స్థానం ఆక్రమించిందని కేంద్ర సర్కార్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతుందని, కృత్రిమంగా పేదలు లేని దేశంగా చూపాలని ప్రయత్నిస్తున్నదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. అర్థికంగా దేశం అభివృద్ధి చెందితే అసమానతలు ఎందుకు పోలేదని, ప్రజలు పేదరికంలో ఎందుకు మగ్గుతున్నారని ప్రశ్నించారు. ప్రతిరోజు రూ.280ల నుండి రూ.320లు సంపాదిస్తే పేదలు ధనవంతులుగా ఎలా మారుతారని ప్రశ్నించారు. నెలకు రూ.8వేలకు కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారన్నారు. నెలకు 20వేల రూపాయల ఆదాయం ఉన్నా పేదవారుగానే పరిగణించాలని అన్నారు. బతుకుదెరువు లేకుండా అర్థాకలితో ప్రజలు జీవనం సాగిస్తున్నారని, ప్రపంచ దేశాలో ఆకలితో అలమటిస్తున్నవారిలో దేశం 101 స్థానంలో నిలిచిందని, ప్రజలకు విద్య, వైద్యం కల్పించటంలో, కొనుగోలు శక్తిలో 124 స్థానంలో నిలిచినట్లు నూచికలు తెలుపుతున్నాయన్నారు. కేంద్రం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, వాస్తవాలను మరుగునపడేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా కనెక్ట్ 2025: 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ఇతివృత్తంతో హైబ్రిడ్ గ్లోబల్ సమ్మిట్...

న్యూఢిల్లీ, జూన్ 14:'యోగా కనెక్ట్' పేరుతో ఒక హైబ్రిడ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఈ నెల 14న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది. ఇది పదకొండో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి (ఐడీవై) ముందస్తుగా చేపడుతున్న ఓ కీలక కార్యక్రమం కానుంది. ఈ శిఖరాగ్ర సదస్సు దేశ విదేశాలకు చెందిన యోగా గురువులను, విధాన రూపకర్తలను, ఆరోగ్య రంగ నిపుణులను, వాణిజ్య రంగ దిగ్గజాలను, పరిశోధకులతో పాటు ప్రజలను ప్రభావితులను చేసే ప్రముఖులను కూడా ఒక చోటుకు తీసుకురానుంది.

ఈ కార్యక్రమానికి యోగా రంగంలో అత్యున్నత పరిశోధన సంస్థ అయిన 'సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి' (సీసీఆర్‌వైఎన్) సమన్వయాన్ని అందించబోతోంది. 'యోగా కనెక్ట్'ను హైబ్రిడ్ ఫార్మేట్‌లో నిర్వహిస్తారు.. అంటే, ఈ కార్యక్రమంలో ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన ప్రధాన అంతర్జాతీయ యోగా సంస్థలతో పాటు వెల్‌నెస్ సముదాయాలకు చెందిన 1,000 మందికి పైగా ప్రతినిధులు స్వయంగా, వీడియో అనుసంధానం ద్వారా పాల్గొంటారు. బ్రెజిల్, అమెరికా, బ్రిటన్, దక్షిణ కొరియాలు సహా అనేక దేశాల నిపుణులు శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో భాగం పంచుకొనే ప్రతి ఒక్క వ్యక్తి యోగా, ఆరోగ్యసంరక్షణ, పరిశోధన, లేదా వెల్‌నెస్ వంటి తమ తమ రంగాల్లో ప్రముఖులు. వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, భారత్ ప్రతిపాదించిన యోగా ఉద్యమం ప్రపంచంలో ఎంతటి ప్రాధాన్యాన్ని పొందిందో చాటనున్నారు.

'యోగ ప్రభావ' ఆవిష్కరణ ఈ శిఖరాగ్ర సదస్సులో ఓ ముఖ్య ఆకర్షణ కాబోతోంది. అంతర్జాతీయ యోగ దినోత్సవం దేశ ప్రజానీకంపై గత పది ఏళ్లలో కలగజేసిన ప్రభావం ఎలా ఉందీ సీసీఆర్‌వైఎన్ అంచనా వేస్తూ రూపొందించిన ఓ అధ్యయన నివేదికే ఈ 'యోగ ప్రభావ'. ఈ నివేదిక విద్యారంగ ప్రముఖులకు, పరిశోధకులకు, ప్రజారోగ్య రంగ వృత్తినిపుణులకు ఎంతో ఉపయోగకరంగా ఉండగలదు. ఎలాగంటే దీనిలో దేశమంతటా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల వ్యాప్తి, ప్రభావశీలత్వం, గొప్ప మార్పులకు కారణమైన యోగా దినోత్సవ ప్రభావం.. ఈ విషయాల గురించి అమూల్య సమాచారాన్ని పొందుపరిచారు.యోగా రంగంలో లబ్ధప్రతిష్ఠులు అనేకమంది పాల్గొననుండడం 'యోగా కనెక్ట్'లో ముఖ్య ఆకర్షణ కాబోతోంది. ఆ ప్రముఖులలో.. స్వామి బాబా రాందేవ్‌జీ, ఆచార్య బాలకృష్ణజీ, హెచ్ఆర్ నగేంద్రజీ, పరమ పవిత్రులు బిఖ్ఖూ సంఘసేనతో పాటు శ్రీ భరత్ భూషణ్‌జీ కూడా ఉన్నారు.

రాబోయే కాలంలో యోగా ఏ విధమైన రూపురేఖలను సంతరించుకొంటుందో ఇప్పుడే చాటిచెబుతున్న వ్యక్తులందరినీ ఒక చోటుకు చేర్చే సందర్భమే 'యోగా కనెక్ట్' కార్యక్రమం. ఇది భారత్ నాంది పలికిన ప్రపంచవ్యాప్త యోగా ఉద్యమానికి పదేళ్లు పూర్తి కావడాన్ని సూచిస్తుంది. 2014లో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించడంతో ప్రపంచం నలు దిశలా యోగా ఉద్యమం మొదలైంది. ప్రపంచానికి భారత్ అందించిన ఒక కానుకే యోగా అని యునెస్కో కూడా గుర్తించింది. ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తూ, భారత్ ఆరోగ్యం, సమతౌల్యం, ఏకతల సందేశాన్ని ప్రపంచదేశాలకు అందిస్తూ వస్తోంది.

# పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తాం.. మంత్రి టీజీ భరత్

కర్నూలు జూన్ 14: రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం జిల్లాకు పరిశ్రమలు తీసుకుని రావడానికి, విద్యా భివృద్ధికి చాలా కృషి చేస్తున్నదని పరిశ్ర మల, వాణిజ్యం అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కర్నూలు పట్టణ ఉస్మానియా కాలేజీ ఆవరణలో నిర్మించిన రాష్ట్రీయ ఉచ్ఛతర శిక్ష అభియాన్ (రూసా) ఆధ్వర్యంలో ఒక కోటి రూపాయలతో నిర్మించిన అదనపు తరగతుల భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు అండ్ సిబ్బందిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూఉస్మానియా కళాశాల పూర్వపు విద్యార్థి అయిన నేను రాష్ట్ర మంత్రిగా రూసా నిర్మించిన అదనపు తరగతుల భవనాల ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కళాశాలలోని సిబ్బంది అందరితోనూ తనకు పరిచయాలు ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారని, రాజకీయాల్లో కూడా బాగానే రాణిస్తున్నారని తెలిపారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి టీ.జీ. భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ఎస్ ఎన్ ముజామిల్, సెక్రటరీ, కరస్పాండెంట్ ఆజ్రా జావేద్, రూసా ఇంచార్జ్ డాక్టర్ ఎన్.గజని, కార్పొరేటర్ పరమేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాలమూరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతు

అమరావతి, జూన్ 14: అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలో వాలమూరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ టి ఆర్ జిల్లా విజయవాడ చెందిన ఆరుగురు యువకులు నేడు మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాలకు విహారయాత్రకు వచ్చారు. దీనిలో భాగంగా మారేడుమిల్లి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వాలమూరు వాగులో స్నానాలకు దిగి సాధిష్ (23),కటకం రవి తేజ(30)లు ప్రమాదవాసాత్తు వాగులోనికి స్నానానికి దిగి ప్రవాహానికి గల్లంతయ్యారు.

దీంతో హటహటిన స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీశారు. స్థానికులు వాగులోనికి దిగరాదని, ఈ వాగుల అనేకమంది మృత్యువాత పడ్డారని హెచ్చరించినా నిర్లక్ష్యంతో వాగులోనికి దిగి ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాగు సమీపంలో స్థానిక అటవీశాఖ, పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టిన యువత పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు.

మృత్యువాత పడ్డ సాధిష్ ఫోటో గ్రాఫర్ గాను,రవితేజ విజయవాడలో కారు ట్రావెల్స్ నిర్వర్తిస్తున్నరని సహచరులు వెల్లడించారు. సమాచారం అందుకొన్న మారేడుమిల్లి సి ఐ సీహెచ్ గోపాల కృష్ణ, గుర్తేడు ఎస్ ఐ పార్థసారథి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వాగులో గాలింపు చర్యలు ముమ్మరం చేసారు. దీనిపై మారేడుమిల్లి పోలీస్ స్టేషన్లో కేసు నవోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఇస్కాన్ టెంపుల్ దగ్ధం -దర్యాప్తునకు పవన్ కల్యాణ్ ఆదేశం

అమరావతి, జూన్ 14: శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు.ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడుగ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్నిప్రమా దం దుర దృష్టకరమని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాం గాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు."ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహూతి కావడం దురదృష్టకరం. శ్రీకా కుళం జిల్లా హిరమండలం సమీపం లోని కూర్మ గ్రామంలో చోటు చేసుకు న్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారు లు సంస్కృతం, తెలుగు, హిం దీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశి ష్టం గా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలిఅని పవన్ స్పష్టం చేశారు.

ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థ

# పౌర కేంద్రీకృత పాలనా విధానాన్ని ప్రోత్సహించడంలో మై గవ్ పాత్ర కీలకంగా మారుతోందన్న సీఈఓ నంద్‌కుమార్

న్యూఢిల్లీ, జూన్ 14:ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని 'మై గవ్', 2025 జూన్ 12న న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో "థింక్ సోషల్ ఏ మై గవ్ " అనే ఒక రోజు కార్యశాలను విజయవంతంగా నిర్వహించింది. మంత్రిత్వశాఖలు, వాటి విభాగాల్లో డిజిటల్ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడం యూట్యూబ్, మెటా, లింక్డ్ ఇన్ వంటి సామాజిక మాధ్యమ వేదికల ద్వారా పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ఈ వర్క్‌షాప్ దృష్టి పెట్టింది. సమ్మిళితమైన అనుసంధానం ద్వారా జనభాగిదారిని సాధించాలన్న ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేయడంలో ఈ కార్యక్రమం తోడ్పడుతుంది.

ఎన్ఈజీడీ అధ్యక్ష సీఈఓ .. డిజిటల్ ఇండియా కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్.. మై గవ్ సీఈఓ శ్రీ నంద్ కుమారమ్, మై గవ్ డైరెక్టర్ శ్రీ శోభేంద్ర బహదూర్, మై గవ్ సీనియర్ అధికారుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. నంద్ కుమారం తమ ప్రసంగంలో మై గవ్ డిజిటల్ ప్రయాణం గురించి తెలియజేశారు. పౌర కేంద్రీకృత పాలనా విధానాన్ని ప్రోత్సహించడంలో మై గవ్ పాత్ర కీలకంగా మారుతోందని అభిప్రాయపడ్డారు. యువతతో అనుసంధానం, పాలనాపరమైన కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడంలో సోషల్ మీడియా పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రజా భాగస్వామ్యాన్ని, పారదర్శకతను పెద్ద ఎత్తున ప్రోత్సహించడంలో తోడ్పడ్డ ముఖ్య ప్రచారాలను గురించి తెలియజేశారు. గౌరవ ప్రధానమంత్రి జనభాగిదారి దార్శనికతకు అనుగుణంగా, ప్రభావవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత అనుసంధానాల కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను మరింత సమర్థంగా వినియోగించుకునే పద్ధతుల గురించిన అభిప్రాయాలను పంచుకున్నారు.

మై గవ్ 11 ఏళ్ళ ప్రయాణం, ప్రధాన ప్రభుత్వ ప్రచారాల్లో, పౌరుల భాగస్వామ్యంలో పెరుగుతున్న మై గవ్ పాత్ర గురించి శ్రీ శోభేంద్ర బహదూర్ వివరించారు. మంత్రిత్వశాఖలు, వాటి విభాగాల్లో డిజిటల్ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడం? యూట్యూబ్, మెటా, లింక్డ్ ఇన్ వంటి సామాజిక మాధ్యమ వేదికలు ద్వారా పౌరుల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై వర్క్‌షాప్ దృష్టి పెట్టింది.

ఈ వర్క్‌షాప్‌లో వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలకు చెందిన డిజిటల్ కమ్యూనికేషన్ నిపుణులు పాల్గొన్నారు. సీనియర్ మై గవ్ అధికారుల సహకారంతో యూట్యూబ్, మెటా సంస్థలకు చెందిన నిపుణులు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సెషన్లలో వ్యూహాత్మక కంటెంట్ అభివృద్ధి, ప్లాట్‌ఫారమ్ ఇంటెలిజెన్స్, ప్రేక్షకుల భాగస్వామ్య పెంపు పద్ధతులపై దృష్టి సారించారు.

వినియోగదారుల దృష్టిని ఆకర్షించడం, వారి భాగస్వామ్యం పెంపు, వారికి అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులో ఉంచేందుకు చేపట్టవలసిన పద్ధతులు.

ఆశిష్ ఖరే – వినూత్న కంటెంట్ సృష్టి, బహుళ-ప్లాట్‌ఫారమ్ పంపిణీ ఫ్రేమ్‌వర్క్‌లు, ప్రభుత్వ సందేశాలను అందించేందుకు అనువైన డిజిటల్ కథన రీతులను మెరుగుపరచడంపై ఒక సెషన్‌ను నిర్వహించారు.

ఉపేంద్ర ఉపాధ్యాయ – డిజిటల్ ప్రచారాలలో పక్కా సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం, ఉత్తమమైన పనితీరు కోసం డేటా ఎనలటిక్స్ వినియోగం గురించి ప్రసంగించారు.

రేణు సింగ్ వ్యూహాత్మక అనుసంధానం, వివిధ ఏజెన్సీల మధ్య భాగస్వామ్యాలు, అధిక-ప్రభావాన్ని చూపిన జాతీయ ప్రచారాల గురించి ఉదాహరణలతో లోతైన విశ్లేషణ చేశారు.

వర్క్‌షాప్ సందర్భంగా ఈ కింది ప్రచారాలు, వ్యూహాత్మక కేస్ స్టడీస్ సహా అనేక అంశాల గురించి చర్చించారు:

పరీక్ష పే చర్చ 2025 – 3 కోట్లకు పైగా ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమం అపూర్వమైన పౌర భాగస్వామ్యాన్ని సాధించింది – భాగస్వామ్య పాలన భావనకు బలోపేతం చేసింది.

జాతీయ క్రియేటర్స్ అవార్డులు – 1.5 లక్షల నామినేషన్లను సొంతం చేసుకుని 6,000 మంది ప్రత్యక్ష భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ప్రజా భాగస్వామ్యాన్ని సుసాధ్యం చేసింది.

చంద్రయాన్-3 మహా క్విజ్ – ఈ జాతీయ విజ్ఞాన ప్రచారోద్యమం టాప్-100 విజేతలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్ర సందర్శన అపూర్వ అవకాశాన్ని కల్పించింది. క్యాంపస్ అంబాసిడర్ ప్రోగ్రామ్ – నిర్మాణాత్మక విద్యా కార్యక్రమాల ద్వారా యువతను పాలనలో చురుకైన భాగస్వాములుగా తీర్చిదిద్దే కార్యక్రమం.

జీడీపీ పాడ్‌కాస్ట్, రోర్ ఫర్ నేచర్ – కీలక విధానాలు, వాతావరణం, పర్యావరణహిత ఇతివృత్తాలపై యువతకు అవగాహన కల్పించేందుకు, ప్రేరణ కలిగించేందుకు రూపొందించిన వ్యూహాత్మక కార్యక్రమాలు.

కోవిడ్-19 సమయంలో మై గవ్ వాట్సప్ సేవలు – టీకా సర్టిఫికెట్లు, నిర్ధారించిన సమాచారాన్ని పౌరులకు సులభంగా అందించడంలో దోహదపడ్డాయి. ఆపరేషన్ సిందూర్ – తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టి, ధృవీకరించిన ప్రభుత్వ సమాచారాన్ని తక్షణమే ప్రజలకు చేరవేసిన విధానానికి మచ్చుతునకగా నిలిచింది.

మై గవ్ స్ట్రీమ్ – పౌర-కేంద్రీకృత, పాలన-సంబంధిత కంటెంట్‌ను భద్రపరిచేందుకు అంకితమైన ప్రత్యేక ఓటీటీ ప్లాట్‌ఫారమ్.

డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విశ్వసనీయ కంటెంట్, కథనం-ఆధారిత కమ్యూనికేషన్, వివిధ డిజిటల్ వేదికలపై ప్రేక్షకులకు అనువైన కంటెంట్ లభ్యతకు ప్రాముఖ్యం. పారదర్శకత, జవాబుదారీతనం, అంశాల ప్రభావాలను తెలుసుకునేందుకు డేటా-ఆధారిత కమ్యూనికేషన్ నమూనాల వినియోగం.

పాలనలో తెలివైన, డేటా ఆధారిత కమ్యూనికేషన్‌ను రూపొందించడంలో "థింక్ సోషల్ ఏ మైగవ్" కార్యశాల ఒక ముఖ్యమైన కార్యక్రమంగా నిలిచింది. నిపుణులు, వ్యూహకర్తలు, డిజిటల్ రంగ ప్రముఖులను ఒక చోటకు చేర్చడం ద్వారా, డిజిటల్ యుగంలో పారదర్శక, సమ్మిళిత, పౌర-కేంద్రీకృత భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో మైగవ్ నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేసింది.

# 25 మంది వైద్యబృందం సాహస యాత్ర

**-కొండరెడ్లు ఖుషీఖుషీ**

**-ఆరు జంటల పెళ్లి వేడుకల్లో వైద్యులు సంబురం**

**-బియ్యం, దుప్పట్లు, దుస్తుల పంపిణీ**

అమరావతి, జూన్ 14:చింతూరు అనగానే ముందుగా గుర్తొచ్చేది ఏజెన్సీ.. ఆ ఏజెన్సీలోని మారుమూల ఏడు గుట్టలు దాటిన తరువాత వచ్చేదే ఏరువాడ గ్రామం. ఈ గ్రామంలో మొత్తం కొండరెడ్డులే జీవనం సాగిస్తుంటారు. అంకిత భావంతో పని చేసే అధికారులు, ఉద్యోగులు మాత్రమే రెండు మూడేళ్ల కోసారి ఈ కుగ్రామాన్ని సందర్శిస్తారు. చింతూరు గత ఐటీడీఏ పీవో ఆకుల వెంకట రమణ "కొండబాట పేరుతో" 2020 ఫిబ్రవరి 15 వ తేదిన ఏరువాడ గ్రామానికి అధికార యంత్రాంగం మొత్తాన్నిఏడు కొండలు ఎక్కించి అక్కడ ఉన్న కొండరెడ్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన తరువాత మరే అధికారి ఈ 5 సంవత్సరాల వ్యవధిలో ఏరువాడ గ్రామాన్ని సందర్శించిన దఖాలాలు లేవు. తులసిపాక పీహెచ్‌సీ వైద్యబృందం ఇప్పుడూ ఆ గ్రామానికి వెళ్లి వైద్య చికిత్సలు అందించి వచ్చింది.

మన్యంలోని చింతూరు మండలం చదలవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏరువాడ గ్రామంలో తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 25 మంది వైద్య సిబ్బంది దట్టమైన అటవీప్రాంతం గుండా కాలినడకన సుమారు 2 కిలో మీటర్ల సాహసయాత్ర చేశారు. అరణ్యంలోని పెద్ద పెద్ద గుట్టలు, కొండలు ఎక్కుతూ అష్టకష్టాలు పడి ఏరువాడ గ్రామానికి చేరుకొని వైద్య శిబిరం నిర్వహించారు. ఆ గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య సేవల్లో ముఖ్యంగా జ్వరం, మలేరియా జ్వరాలకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, అంటు వ్యాధులను ముందస్తుగా గుర్తించడానికి సర్వేలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, విద్య ప్రాముఖ్యతపై పిల్లలకు, అన్ని వయసుల వారికి ఆరోగ్య అవగాహన కల్పించారు. ప్రతి గుడి సెలల్లో దోమల నియంత్రణ కోసం ఇండోర్ అవశేష స్ప్రేయింగ్ చేపట్టారు. తులసిపాక వైద్య బృందం వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి వెళ్లిన రోజే ఆ గ్రామంలో ఒకే రోజు 6 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ వివాహ వేడుకలకు వైద్య బృందాన్ని అతిథులుగా కొండరెడ్లు ఆహ్వానించి పండుగ ఉత్సాహాల మధ్య వైద్యబృం దంపై పూల దండలు, జానపద పాటలు స్వాగతం పలికారు. ఈ అనుభవాలతో వైద్య బృందం పరవశించారు. ఏరువాడ గ్రామ పర్యటనకు వెళ్లిన తులసిపాక పీహెచ్‌సీ వైద్య బృందం తీసుకెళ్లిన బియ్యం బస్తాలతో పాటు దాతలు ఇచ్చినటువంటి దుస్తులు, దుప్పట్లు 25 కుటుంబాలకు చెందిన 100 మంది కొండరెడ్లకు పంపిణీ చేశారు.

# చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండపల్లి ఖిల్లా

అమరావతి, జూన్ 14: చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండపల్లి ఖిల్లాపై ప్రకృతి రమణీయత మధ్య యోగా సాధకుల ధిల్లానా అద్భుతంగా సాగింది. యోగాసనాల శ్వాస లయలతో కొండపల్లి ఖిల్లా పులకించింది. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సారథ్యంలో శనివారం కొండపల్లి కోటపై ప్రత్యేక యోగాసనాల అభ్యసన కార్యక్రమం విజయవంతమైంది. కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎన్.ఇలక్కియ, ఏపీఎన్‌జీజీవో అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్.. వందలాది స్థానికులు, ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా హరిత శోభకు, చారిత్రక ఔన్నత్యానికి నిలువుటద్దంగా ఉన్న కొండపల్లి ఖిల్లాపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మన చారిత్ర వారసత్వ సంపద అయిన యోగా నేడు విశ్వవ్యాప్తమైందని, బీపీ, మధుమేహం, హార్మోన్ల అసమతుల్యం వంటి జీవనశైలి అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు యోగా రామబాణం అని పేర్కొన్నారు. 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌ను నేర్చుకొని ప్రతిరోజూ యోగ సాధనను భాగం చేసుకొని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి దార్శనికత అయిన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి యోగాసనాలు పునాది వేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు నిరాంటంకంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ యోగాసనాల ఆచరణకు రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని, పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచానికి మన దేశం ఇచ్చిన గొప్ప కానుక యోగా..

దేశ సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాల్లో ఏపీ ఎన్‌జీజీవో ఎప్పుడూ భాగస్వామ్యం అవుతూ తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగ విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి, మంచి ఫలితాలు సాధించేందుకు యోగాసనాల అభ్యసన దోహదం చేస్తుందన్నారు. ఒత్తిడి రహిత జీవితం కోసం యోగాను మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

అలరించిన కళాత్మక, సందేశాత్మక సాంస్కృతిక కార్యక్రమాలు..

కొండపల్లి ఖిల్లాపై జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంతో సాగిన కళాత్మక ప్రదర్శన ప్రేక్షకుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది. మన వీర సైనికుల పోరాట పటిమ, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను గుర్తుచేస్తూ సాగిన ప్రదర్శనపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈ ప్రదర్శన యోగాంధ్ర విశిష్టతతో పాటు మనకు మనోధైర్యాన్నించిందని పేర్కొన్నారు. మన వీరసైనికుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. శిరీష యోగా అకాడమీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు యోగా ఔత్సాహికులను ఆకట్టుకున్నాయి.

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యమిస్తూ పర్యావరణ హిత నైపుణ్యాలపై సంయుక్త శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ), షెల్ ఇండియా

న్యూఢిల్లీ, జూన్ 14:నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ) షెల్ ఇండియా సహకారంతో పర్యావరణ హిత నైపుణ్యాలు (గ్రీన్ స్కిల్స్), ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పర్యావరణ హిత ఇంధనం, ఎలక్ట్రిక్ రవాణా విషయాల్లో విద్యార్థులు, అధ్యాపకులను భవిష్యత్ సన్నద్ధులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యం. శిక్షణలో షెల్ భాగస్వామి అయిన ఎడ్యునెట్ ఫౌండేషన్ ద్వారా 2025 జూన్ 12న ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలోని ఎంపిక చేసిన పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థలు (ఎన్ఎస్‌టీఐ)లలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు.

డీజీటీ-షెల్ ఇండియా భాగస్వామ్యంలో ఎంపిక చేసిన ఎన్ఎస్‌టీఐలు, ఐటీఐల్లో నిర్మాణాత్మక బహుళ అంచెల సమూనాతో ఈ శిక్షణ అందించనున్నారు. తొలి దశలో- ఈ కార్యక్రమంలో 4 ఎన్ఎస్టీఐలలో 240 గంటల అడ్వాన్స్డ్ ఈవీ టెక్నిషియన్ కోర్సు, షెల్ మద్దతుతో ప్రయోగశాలలున్న 12 ఐటీఐలలో 90 గంటల ఉద్యోగ ఆధారిత ఈవీ నైపుణ్యాల కోర్సు, అదనంగా ప్రయోగశాలలు లేని ఐటీఐలలో 50 గంటల ప్రాథమిక హరిత నైపుణ్యాల మాడ్యూల్ ఉంటాయి. ఈ పాఠ్య ప్రణాళికను షెల్, ఎడ్యునెట్ ఫౌండేషన్, డీజీటీ సంయుక్తంగా రూపొందించాయి. ఎలక్ట్రిక్ వాహన వ్యవస్థలు, సమస్యల గుర్తింపు, బ్యాటరీ సాంకేతికత, డిజిటల్ సాధనాలు, భద్రతాపరమైన నియమాలు ఇందులో ఉన్నాయి. 250 మందికి పైగా అధ్యాపకులకు శిక్షణ (టీవోటీ), షెల్, డీజీటీ సంయుక్త ధ్రువీకరణ, వ్యవస్థాగతమైన నియామక మద్దతుతో పారిశ్రామిక సన్నద్ధతను పెంచడం కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి.

ఎంపిక చేసిన ఐటీఐలు, ఎన్ఎస్‌టీఐలలో ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ వాహన నైపుణ్యాలకు సంబంధించి ప్రయోగశాలలను నెలకొల్పడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశం. పారిశ్రామిక ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యక్ష శిక్షణ, నిపుణుల నేతృత్వంలో సదస్సుల నిర్వహణ కోసం ఈ ప్రయోగశాలలను రూపొందించారు. ప్రయోగశాలల్లో అభ్యసనానికే పరిమితం కాకుండా.. నియామకాల విషయంలోనూ చేయూతనిస్తుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి సంయుక్తంగా బ్రాండెడ్ ధ్రువీకరణను కూడా అందిస్తారు. హరిత ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన రంగాల్లో వారి ఉపాధి అవకాశాలను ఇది మెరుగుపరుస్తుంది.

నికర శూన్య ఉద్గార లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం హరిత ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణను వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల త్వరిత స్వీకరణ (ఎఫ్ఏఎంఈ- ఫేమ్) పథకం వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని వేగవంతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిర్దేశిత ప్రోత్సాహకాలను అందించడంలో కీలక పాత్ర పోషించాయి. జాతీయ స్థాయిలో ఈ కృషికి తోడుగా.. ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలు సొంత ఎలక్ట్రిక్ వాహన విధానాలను రూపొందించాయి. తద్వారా ఎలక్ట్రిక్ విధానం దిశగా రవాణా రంగాన్ని మరింత వేగంగా మళ్లించడం, స్థానికంగా ఆ వ్యవస్థలను పెంపొందించడం, పర్యావరణానికి నష్టం కలగకుండా ఉద్యోగ అవకాశాలను సృష్టించడం సాధ్యమవుతుంది. ఈ పరిణామాలు హరిత ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన రంగాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు అవకాశాలు పెరుగుతుండడాన్ని సూచిస్తున్నాయి.

వృత్తిపరమైన శిక్షణకు సంబంధించి అత్యున్నత జాతీయ సంస్థగా.. విద్యార్థులు, శిక్షకులను సమీకరించడంతోపాటు జాతీయ విద్య, నైపుణ్యాభివృద్ధి ప్రమాణాలకు అనుగుణంగా సంస్థాగత ఏర్పాట్ల ద్వారా ఈ కార్యక్రమంలో డీజీటీ కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. "షెల్ ఇండియాతో మా సహకారం నైపుణ్యాన్నీ సుస్థిరతనూ అనుసంధానించడంపట్ల ప్రభుత్వ దృఢమైన నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. హరిత ఇంధనం, ఎలక్ట్రిక్ రవాణా, కర్బనోద్గారాలను విస్తృతంగా తగ్గించడం మొదలైన అంశాలు కేవలం పర్యావరణపరంగా అనివార్యతలు మాత్రమే కాదు.. ఆవిష్కరణ, ప్రతిభ, సాహసోపేతమైన కృషి ద్వారా పురోగమనం దిశగా అవి భారత్‌లో యువత ఉపాధికి అవరోధాలను తొలగిస్తాయి. కేవలం ఉద్యోగ సన్నద్ధత మాత్రమే కాకుండా, పర్యావరణపరంగా కూడా సంసిద్ధులైన శ్రామిక శక్తిని సృష్టించే మా విస్తృత లక్ష్యంలో ఈ కార్యక్రమం అంతర్భాగం. పర్యావరణ హిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కేవలం భాగస్వామిగానే ఉండడం కాదు, దానిని తీర్చిదిద్దే నైపుణ్యాలతో భారత యువతను మేం సన్నద్ధులను చేస్తున్నాం" అని నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి పేర్కొన్నారు.

నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ) డైరెక్టర్ జనరల్ శ్రీమతి త్రిశాల్ జిత్ సేథీ మాట్లాడుతూ.. "మన ఐటీఐలు, ఎన్ఎస్టీఐలలో అత్యాధునిక శిక్షణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమ సంబంధిత పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడంపై షెల్ ఇండియాతో భాగస్వామ్యం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఎలక్ట్రిక్ వాహన సాంకేతికతను వృత్తిపరమైన శిక్షణతో మిళితం చేయడం ద్వారా పరిశ్రమలో వాస్తవిక అవసరాలకు తగినట్టుగా మన విద్యార్థులు ప్రత్యక్ష అనుభవాన్ని పొందేలా చూస్తున్నాం. ఉమ్మడి ధ్రువీకరణ, అధ్యాపకుల నైపుణ్యాలను మెరుగుపరచడం, నియామకాల విషయంలో చేయూతనివ్వడం వంటి అంశాలు ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమం పర్యావరణ హిత రవాణా రంగంలో మన యువతకు విశేషంగా ఉపాధి అవకాశాలను పెంచుతుంది'' అన్నారు.

ఈ భాగస్వామ్యంపై భారత్‌లో షెల్ గ్రూప్ కంపెనీల చైర్‌పర్సన్, షెల్ లూబ్రికెంట్స్ ఆసియా పసిఫిక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాన్సీ మదన్ త్రిపాఠి మాట్లాడుతూ.. "షెల్‌లో భవిష్యత్తు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా స్థానిక సమూహాలకు చేయూతనివ్వాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. భవిష్యత్తులో కర్బనోద్గారాలను తగ్గించే దిశగా పర్యావరణ హిత ఇంధన నైపుణ్యాలతో యువతను సన్నద్ధులను చేయడం అత్యంత ముఖ్యమైన అంశం. డీజీటీ, ఎడ్యునెట్ ఫౌండేషన్ సహకారంతో హరిత ఇంధనం, ఎలక్ట్రిక్ రవాణాల్లో ప్రయోగాత్మక, భవిష్యత్ సన్నద్ధ నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నాం. అభివృద్ధి చెందుతున్న ఇంధన రంగంలో యువత సాధికారతను పెంచడానికి, ఉద్గారాల్లో నికర శూన్యతను సాధించాలన్న భారత ఆశయాలకు ఇది దోహదం చేస్తుంది" అన్నారు.

పర్యావరణ హితంగా ఆర్థికాభివృద్ధి దిశగా భారత యువత కెరీర్‌ను సన్నద్ధం చేసుకోవడంలో- డీజీటీ, షెల్ ఇండియా మధ్య ఈ సహకారం శక్తిమంతమైన చర్య. సమగ్ర పాఠ్యప్రణాళిక, ప్రత్యేక ప్రయోగశాలలు, ఈ రంగంలో చేయూతనివ్వడం ద్వారా.. ప్రయోగాత్మక నైపుణ్యాలు, ధ్రువీకరణల ద్వారా ఈ కార్యక్రమం విద్యార్థులను సన్నద్ధులను చేస్తుంది. వారి ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు సుస్థిరమైన, సృజనాత్మక ఆధారిత భవితకు నేతృత్వం వహించేలా వారిని నిలుపుతుంది.

# కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేసిన జోనల్ చైర్మన్

అమరావతి, జూన్ 14:కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్ ను జోనల్ చైర్మన్ పూల నాగరాజు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండులోని ప్రయాణీకులను, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ లోని దుకాణాల్లో వస్తువుల విక్రయాలు అధిక ధరలకు విక్రయంపై కొందరు ప్రయాణికులు జోనల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని విచారించి చర్యలు తీసుకుంటామని జోనల్ చైర్మన్ ప్రయాణికులకు హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి చొరవతో బస్టాండులలోని వసతులు మెరుగు పడ్డాయని ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేశారు. బస్టాండులోని వసతుల నిర్వహణ పట్ల జోనల్ చైర్మన్ సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం కర్నూలు-2 డిపో గ్యారేజీలో మొక్కను నాటారు. గ్యారేజీలో కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్మికులు, తమ సమస్యలను జోనల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై నాగరాజు సానుకూలంగా స్పందించారు. సంస్థ పరిధిలోని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా జూన్ నెల చైర్మన్ వెంట ఆర్టీసీ ఆర్ఎం టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అడవుల్లో కొత్త జీవి.. అరుదైన 'నలికిరి' గుర్తింపు

తిరుపతి, జూన్ 14: తూర్పు కనుమల్లో విస్తరించిన శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్ జీవవైవిధ్యానికి పెట్టింది పేరు. ఇక్కడి అటవీ ప్రాంతంలో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు ఒక అరుదైన, కొత్త జాతికి చెందిన స్కింక్ (నలికిరి)ను కనుగొన్నారు. ఈ కీలక విషయాన్ని జెడ్ఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ధ్రితి బెనర్జీ వెల్లడించారు. ఈ నూతన ఆవిష్కరణ జీవ వైవిధ్య పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది.

కొత్తగా గుర్తించిన ఈ స్కింక్ జాతికి డెక్కన్ గ్రాసైల్ స్కింక్ అని శాస్త్రీయ నామకరణం చేసినట్టు డాక్టర్ బెనర్జీ తెలిపారు. ఈ జీవి చూడటానికి పాముని పోలి ఉంటుందని, దీనికి పాక్షిక పారదర్శకమైన కనురెప్పలు, శరీరంపై విభిన్నమైన చారలు ఉన్నాయని ఆమె వివరించారు. ప్రస్తుతం ఈ అరుదైన జీవి ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం అటవీ ప్రాంతం తో పాటు, తెలంగాణాలోని అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో మాత్రమే కనిపిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ రెండు ప్రాంతాల్లో ఇటువంటి ప్రత్యేక జీవి మనుగడ సాగిస్తుండటం అక్కడి జీవావరణ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేస్తోందని డాక్టర్ బెనర్జీ పేర్కొన్నారు.

ఈ ముఖ్యమైన పరిశోధనలో జెడ్ఎస్ఐకి చెందిన హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం, కోల్‌కతాలోని రెప్టిలియా విభాగం శాస్త్రవేత్తలతో పాటు లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంకు చెందిన పరిశోధకులు కూడా పాలుపంచుకున్నారని జెడ్ఎస్ఐ ప్రతినిధి డాక్టర్ దీపా జైస్వాల్ తన ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఆవిష్కరణలు తూర్పు కనుమల ప్రాంతంలోని జీవ వైవిధ్య సంపదను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి, దాని పరిరక్షణకు దోహదపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నియోజకవర్గంలో ఇసుక దందా బంద్ : మంత్రి వివేక్

చెన్నూర్, జూన్ 14: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక దందాలను వెంటనే నిలిపి వేయాలని కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హుకుం జారీ చేశారు. చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి మంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారిగా శనివారం మధ్యాహ్నం నియోజకవర్గంలోని ఇందారం చేరుకున్నారు.

మంత్రికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇందారం, రసూలపల్లి, జైపూర్, భీమారంలో కార్నర్ మీటింగ్ లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తనపై నమ్మకంతో మైనింగ్, కార్మిక మంత్రి పదవులను అప్పగించిందని, ఆ శాఖలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

తన ఇలాఖలో ఎలాంటి అక్రమ దందాలు సాగనివ్వనని ఇది తన హెచ్చరిక అని అన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగినా పోలీసులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజాయితీగా పని చేస్తూ ప్రజలకు సేవకులుగా ఉందామని నాయకులకు పిలుపునిచ్చారు.

తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన మంత్రికి నాయకులు కార్యకర్తలు, ఘనంగా స్వాగతిస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

# ఈఈ శ్రీధర్‌ను కస్టడీకి కోరుతూ ఏసీబీ పిటిషన్

హైదరాబాద్, జూన్ 14: ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే అభియోగాలపై ఏసీబీ కేసు నేరకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్ రిమాండ్‌లో ఉన్నట్లు తెలిసిందే. అయితే ఈఈ శ్రీధర్‌ను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రూ.150 కోట్లకు పైగా శ్రీధర్ అక్రమంగా ఆస్తులను కూడబెట్టినట్లుగా ప్రాథమికంగా సమాచారం. అక్రమాస్తుల కేసులో మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని.. వారం రోజుల పాటు శ్రీధర్?ను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోరింది.

అక్రమాస్తుల కేసు లో పట్టుబడిన కాళేశ్వరం ఈఈ శ్రీధర్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని సమాచారం. దీంతో మరి కొంతమంది అధికారుల పాత్రపై ఏసీబీ ఆరా తీస్తోంది. శ్రీధర్ అక్రమాలు, అవకతవకలు కాళేశ్వరం కమిషన్ చైర్మన్ రాహుల్ బొజ్జా దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. మరోవైపు ఈఎన్‌సీ అనిల్, శ్రీధర్ సంబంధాలపై కూడా ఏసీబీ ఆరా తీస్తుందని తెలుస్తోంది.

# 100 శాతానికి పైగా పరిష్కార రేటుతో ముందంజలో కర్నాటక, కేరళ రాష్ట్రాల కమిషన్లు

న్యూఢిల్లీ, జూన్ 14:వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేస్తూ, సంస్థాగత సామర్థ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ఈనెల 13న చెన్నైలో "దక్షిణాది రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వినియోగదారుల భద్రత"అనే అంశంపై ప్రాంతీయ కార్యశాలను నిర్వహించింది.

ఈ సందర్భంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీమతి నిధి ఖారే మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగానికి అనుకూలంగా ఉండే చట్టపరమైన, డిజిటల్ యంత్రాంగాల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ప్రారంభ దశలోనే వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడంలో.. వేగవంతమైన, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, తక్కువ ఖర్చుతోనే రైట్ టు రిపేర్ పోర్టల్, ఇ-జాగృతి, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. డార్క్ ప్యాటర్న్ లు, నకిలీ రివ్యూలు, తప్పుదారి పట్టించే ప్రకటనలను అరికట్టడానికి సీసీపీఏ అమలు చేస్తున్న నియంత్రణ చర్యలను కూడా ప్రస్తావించిన ఆమె.. ఈ విషయంలో ఆదర్శప్రాయమైన పనితీరును, ముఖ్యంగా అత్యధిక కేసుల్లో పరిష్కారాలను సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యంగా మధ్యవర్తిత్వం, వర్చువల్ విచారణల ద్వారా ప్రపంచ స్థాయి ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రూపొందించడం కోసం నిరంతర ఆవిష్కరణలు, సహకారం, సమ్మిళిత వినియోగం అవసరమని ఆమె పిలుపునిచ్చారు.

2025లో, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు వచ్చిన 5.41 లక్షల ఫిర్యాదుల్లో 23 శాతం దక్షిణాది రాష్ట్రాల నుంచే వచ్చాయని, ఇది బలమైన ప్రాంతీయ భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నమోదైన 28.54 లక్షల కేసుల్లో 5.62 లక్షల కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, దక్షిణాది రాష్ట్రాలు కేవలం 13.34 శాతం మాత్రమేనని శ్రీమతి నిధి ఖారే పేర్కొన్నారు. దాఖలు అయిన వాటి కంటే ఎక్కువ కేసులను పరిష్కరించి కర్నాటక, కేరళ కమిషన్లు ముందంజలో ఉన్నాయనీ, అనేక జిల్లా కమిషన్లు సైతం వరుసగా మూడు సంవత్సరాల్లో 100 శాతానికి పైగా పరిష్కారాలను సాధించాయని ఆమె పేర్కొన్నారు. వర్చువల్ కోర్టుల ద్వారా 11,900 కంటే ఎక్కువ కేసులను విచారించామన్నారు. ఏఐ-ఆధారిత ఏకీకృత వేదిక ఇ-జాగృతిని గురించి వివరిస్తూ, ఇ-దాఖిల్, కాన్ఫోనెట్ వంటి కీలక వ్యవస్థల ఏకీకరణతో రూపొందించిన ఈ వేదిక.. చాట్‌బాట్ ఆధారిత రిజిస్ట్రేషన్, బహుళ భాషల్లో అందుబాటులో ఉండడం, న్యాయ నిపుణులు, దివ్యాంగులైన వినియోగదారులకు మద్దతు అందించడం వంటి లక్షణాలను కలిగి ఉంటుందని తెలిపారు.

కార్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో, ఎన్‌సీడీఆర్‌సీ అధ్యక్షులు జస్టిస్ అమరేశ్వర్ ప్రతాప్ సాహి మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణ చట్టం పరిణామ పరిధిని, సంప్రదాయిక కోర్టుల నుంచి వినియోగదారుల కమిషన్లకు వ్యాజ్యాలు పెరుగుతున్న తీరును ప్రధానంగా ప్రస్తావించారు. వినియోగదారుల వివాద పరిష్కార వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించి, మరింత మందికి దానిని అందుబాటులోకి తెచ్చేందుకు డిజిటల్-హితమైన, సాంకేతికత-ఆధారితమైన విధానాలను అవలంబించాలని కోరిన ఆయన.. జిల్లా వినియోగదారుల కమిషన్లకు మార్గదర్శనం చేశారు. వేగంగా మారుతున్న పరిస్థితులు నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి డిజిటల్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాల్సిన ప్రాముఖ్యతను జస్టిస్ సాహి స్పష్టం చేశారు. కమిషన్ ఆదేశాలను సమర్థంగా అమలు చేయడానికి ప్రభుత్వ విభాగాలతో సరైన భాగస్వామ్యం కలిగి ఉండాలనీ, వైద్యపరమైన నిర్లక్ష్యం, ఆటోమొబైల్ వివాదాల వంటి నిపుణుల అభిప్రాయాలు అవసరమయ్యే కేసుల విషయంలో వారితో సకాలంలో సమన్వయం చేసుకోవాలని సూచించారు. దాని వల్ల దర్యాప్తుల్లో జాప్యం జరగదని, వినియోగదారులకూ సకాలంలో పరిష్కారం లభిస్తుందన్నారు.

ఈ కార్యశాలలో సాంకేతికత అంశంపై చర్చకు నాలుగు సమావేశాలు, అదే సమయంలో మరో రెండు సమావేశాలనూ నిర్వహించారు. ఈ సమావేశాలకు జస్టిస్ అమరేశ్వర్ ప్రతాప్ సాహి అధ్యక్షత వహించగా, శ్రీమతి నిధి ఖారే సహాధ్యక్షత వహించారు. కీలక రంగాల్లో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారాన్ని బలోపేతం చేయడం గురించి ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించారు. న్యాయరంగ ప్రముఖులు, రాష్ట్రస్థాయి అధికారులు, న్యాయ నిపుణుల క్రియాశీల భాగస్వామ్యంతో.. ఈ సమావేశాల్లో ఇ-జాగృతి, రియల్ ఎస్టేట్-బీమా ఫిర్యాదుల యంత్రాంగాలు, వైద్య నిర్లక్ష్య పరిష్కార వేదికల ద్వారా డిజిటల్ ఆవిష్కరణలను గురించి ప్రధానంగా చర్చించారు. ఇతర సమావేశాల్లో జన్ విశ్వాస్ చట్టం-2023కు అనుగుణంగా లీగల్ మెట్రాలజీని అమలు చేయాల్సిన ప్రాముఖ్యతను చర్చించారు. అలాగే స్వతంత్ర పరీక్షల నిర్వహణతో ఉత్పత్తి నాణ్యత, భద్రతను నిర్ధారించడం ద్వారా, దక్షిణ భారత వినియోగదారుల భద్రతను, ఈ రంగంలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంలో నేషనల్ టెస్ట్ హౌస్ కీలక పాత్రను ప్రధానంగా చర్చించారు.

దేశవ్యాప్తంగా వినియోగదారుల కేసుల నిరంతర పర్యవేక్షణ కోసం ఈ విభాగం ప్రత్యేకంగా కృషి చేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఒకరోజు ప్రాంతీయ కార్యశాలలు, రాష్ట్రస్థాయి సమావేశాలను నిర్వహించడం దీనిలో భాగంగా ఉంది. వినియోగదారుల కేసుల పెండింగ్ సమస్యను చర్చించడానికి, అలాగే వేగవంతమైన, మరింత ప్రభావవంతమైన పరిష్కారాన్ని అందించడానికి ఆచరణీయ పరిష్కారాలను గుర్తించడంలో ఈ చర్చలు కీలక వేదికలుగా పనిచేశాయి.కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి శ్రీ భరత్ ఖేరా మాట్లాడుతూ, నైతిక వాణిజ్యంలో భారత చారిత్రక మూలాలను, వినియోగదారుల భద్రత చట్టం-2019 పరివర్తన ప్రభావాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. తమిళనాడు ప్రభుత్వ సహకార, ఆహారం-వినియోగదారుల భద్రత శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ తిరు సత్యబ్రత సాహూ మాట్లాడుతూ, వినియోగదారుల భద్రత సంస్థలను బలోపేతం చేయడానికి సామర్థ్యాలను పెంపొందించడం, శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులకు న్యాయం జరిగేలా చేయడంలో విధాన రూపకర్తల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

ఈ కార్యశాలలో పాల్గొన్న రాష్ట్రాలు, సంబంధిత వ్యక్తులు వారి అధికారిక పరిధిలో వినియోగదారుల భద్రత విధానాల బలోపేతం కోసం కలిసి పనిచేయడానికి కట్టుబడి ఉంటామని ప్రకటించడంతో ఈ కార్యశాల ముగిసింది. దక్షిణాది రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో, దేశవ్యాప్తంగా వినియోగదారుల శ్రేయస్సు కోసం వినియోగదారుల భద్రతా చట్టాలు, నిబంధనలు, కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంలో రాష్ట్రాలు, ఇతర సంబంధిత వ్యక్తులు, సంస్థలకు సహకారం కొనసాగుతుందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రకటించింది.

సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర కమిషన్ ల సభ్యులు, జిల్లా కమిషన్ ల అధ్యక్షులు, సభ్యులు, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లక్షద్వీప్, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవులు సహా దక్షిణ భారత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన ఇతర ప్రముఖులు సహా ఈ ప్రాంతంలోని స్వచ్ఛంద వినియోగదారుల సంస్థల ప్రతినిధులు ఈ కార్యశాలలో పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలలో వినియోగదారుల న్యాయాన్ని బలోపేతం చేయడానికి చెన్నైలో ప్రాంతీయ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్న వినియోగదారుల వ్యవహారాల శాఖ

న్యూఢిల్లీ, జూన్ 14:వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను బలోపేతం చేయడానికి మరియు సంస్థాగత సామర్థ్యాన్ని ప్రోత్సహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించడానికి భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల శాఖ జూన్ 13, 2025న చెన్నైలో "దక్షిణాది రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో వినియోగదారుల రక్షణ"పై ప్రాంతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించింది.

తన ముఖ్య ప్రసంగంలో, భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీమతి నిధి ఖరే డిజిటల్ యుగానికి అనుకూల చట్టపరమైన మరియు డిజిటల్ యంత్రాంగాలు అవసరమని నొక్కి చెప్పారు. రిపేర్ హక్కు పోర్టల్, ఇ-జాగృతి మరియు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌ను బలోపేతం చేయడం వంటి చొరవల ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు, ఇది ముందస్తు దశలో వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించే వేగవంతమైన, ఇబ్బంది లేని మరియు చవకైన పద్ధతి. చీకటి నమూనాలు, నకిలీ సమీక్షలు మరియు తప్పుదారి పట్టించే ప్రకటనలను అరికట్టడానికి అఅఖం యొక్క నియంత్రణ చర్యలను కూడా ఆమె గుర్తించారు మరియు దక్షిణాది రాష్ట్రాల ఆదర్శప్రాయమైన పనితీరు ను, ముఖ్యంగా కేసు తొలగింపు రేట్లలో ప్రశంసించారు. ముఖ్యంగా మధ్యవర్తిత్వం మరియు వర్చువల్ విచారణల ద్వారా ప్రపంచ స్థాయి ఫిర్యాదుల పరిష్కారానికి నిరంతర ఆవిష్కరణ, సహకారం మరియు సమగ్ర ప్రాప్యత కోసం ఆమె పిలుపునిచ్చారు.

2025లో, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 5.41 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 23% దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చాయని, ఇది బలమైన ప్రాంతీయ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆమె హైలైట్ చేశారు. జాతీయంగా నమోదైన 28.54 లక్షల కేసుల్లో 5.62 లక్షలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, దక్షిణాది రాష్ట్రాలు కేవలం 13.34% మాత్రమే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. కర్ణాటక మరియు కేరళ కమిషన్లు దాఖలు చేసిన దానికంటే ఎక్కువ కేసులను పరిష్కరించాయని మరియు అనేక జిల్లా కమిషన్లు వరుసగా మూడు సంవత్సరాలలో 100%+ పరిష్కార రేట్లను సాధించాయని ఆమె ఈ ప్రాంత పనితీరును ప్రశంసించారు. వర్చువల్ కోర్టుల ద్వారా 11,900 కంటే ఎక్కువ కేసులు విచారించబడ్డాయని కూడా ఆమె నివేదించారు.

# యాదాద్రిలో ఒకరు ఆత్మహత్య

యాద్రాద్రి, జూన్ 14: ఆలేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నివాసంలో అద్దెకు ఉంటున్న ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. గంధమల్ల రవి (38) అనే వ్యక్తి యాదగిరి పట్టణంలోని ఎమ్మెల్యే ఐలయ్య ఇంట్లోని పెంట్ హౌస్‌లో ఉంటున్నాడు. రవి మృత దేహాన్ని భువనగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ఐలయ్య సందర్శించారు. మృతిచెందిన రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంధమల్ల రవి యాదగిరి పట్టణంలోని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లోని పెంట్ హౌజ్‌లో నివానం ఉంటున్నాడు. రెండు రోజులుగా అతడు సొంత గ్రామమైన సైదాపురానికి వెళ్లి.. శుక్రవారం యాదగిరిగుట్టకు వచ్చి మరణించాడు. అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యతో కలిసి రవి గత కొన్నేళ్లుగా ఎమ్మెల్యే ఇంట్లోనే పని చేస్తున్నట్లుగా తెలుస్తోంది. రవి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# పద్మ పురస్కాలకు దరఖాస్తుల ఆహ్వానం - కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జూన్ 14 : కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన పద్మ పురస్కారాలకు అర్హులైన వారి నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన రంగాల్లో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు అందజేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

జాతి, వృత్తి, లింగ బేధం లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులన్నారు. 2026 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ https://awards.gov.inని ద్వారా స్వీకరించబడతాయని వెల్లడించారు. నామినేషన్లను 31జూలై, 2025 లోగా పైన పేర్కొన్న పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో, గరిష్టంగా 800 పదాలకు మించకుండా వివరణాత్మక కథనం రూపంలో పంపించాలని తెలిపారు.

ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపడానికి అవసరమైన సూచనల https://awards.gov.inని పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని, అలాగే నియమ నిబంధనలు పద్మ అవార్డుల వెబ్‌సైట్: https://padmaawards.gov.in లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో పైన పేర్కొన్న రంగాల్లో అత్యున్నత, విశిష్ట సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవాలని, ముఖ్యంగా మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగుల్లో ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# కొచ్చి తీరంలో అగ్ని ప్రమాదానికి గురైన సింగపూర్ నౌకను స్థిరీకరించడానికి ఐసిజి, నేవీ & ఐఎఎఫ్ అధిక-రిస్క్ ఆపరేషన్‌ను అమలు

న్యూఢిల్లీ, జూన్ 14:సింగపూర్ నౌక ఎంవి వాన్ పై 503 అగ్నిమాపక మరియు రక్షణ ఆపరేషన్‌లో ఒక ప్రధాన అభివృద్ధిలో, భారత నావికాదళం మరియు భారత వైమానిక దళంతో కలిసి ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి), జూన్ 13, 2025న ప్రమాదంలో ఉన్న కంటైనర్ నౌకను సముద్రంలో ప్రయాణించే టగ్ ఆఫ్‌షోర్ వారియర్‌కు విజయవంతంగా బదిలీ చేసింది. ఐసిజి చాలా రోజులుగా కేరళ తీరం నుండి నౌకను దూరంగా ఉంచింది, కానీ వాతావరణ పరిస్థితుల్లో ఆకస్మిక క్షీణత మరియు బలమైన పశ్చిమ గాలులు కారణంగా అది తీరం వైపు ప్రమాదకరంగా కొట్టుకుపోయింది.

ప్రతికూల వాతావరణం వల్ల వైమానిక కార్యకలాపాలు పరిమితం కావడం మరియు రక్షణ సిబ్బంది ఎక్కడం ఆలస్యం కావడం వంటి ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ, జూన్ 13న కొచ్చి నుండి ప్రారంభించబడిన నేవీ సీ కింగ్ హెలికాప్టర్ అత్యంత సవాలుతో కూడిన పరిస్థితులలో రక్షణ బృంద సభ్యులను నౌకలోకి విజయవంతంగా చేర్చింది. ఆ తర్వాత బృందం కొచ్చి తీరం నుండి దాదాపు 20 నాటికల్ మైళ్ల దూరంలో ఆఫ్‌షోర్ వారియర్‌కు 600 మీటర్ల టో రోప్‌ను అనుసంధానించగలిగింది. ఈ నౌకను ఇప్పుడు 1.8 నాట్ల వేగంతో పశ్చిమ దిశగా లాగుతున్నారు మరియు ఆఫ్‌షోర్‌లో దాదాపు 35 నాటికల్ మైళ్ల దూరంలో ఉంది.

మూడు ఐసిజి ఆఫ్‌షోర్ పెట్రోల్ నౌకలు కంటైనర్ నౌకను ఎస్కార్ట్ చేయడం మరియు అగ్నిమాపక కార్యకలాపాలను కొనసాగించడం కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం, దట్టమైన పొగ మరియు కొన్ని వివిక్త హాట్‌స్పాట్‌లు మాత్రమే బోర్డులో ఉన్నాయి, ఇది ఒక పెద్ద పర్యావరణ విపత్తును నివారించడంలో సహాయపడిన ఐసిజి యొక్క ప్రభావవంతమైన అగ్నిమాపక ప్రయత్నాలకు నిదర్శనం.

అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా, నౌక యజమానులు దాని విధిని నిర్ణయించే వరకు, నౌక భారత తీరప్రాంతం నుండి కనీసం 50 నాటికల్ మైళ్ల దూరంలో ఉండేలా చూసుకోవడానికి ఐసిజి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌తో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటోంది. అదనపు అగ్నిమాపక యంత్రాలు వచ్చే అవకాశం ఉన్నందున పరిస్థితి మరింత స్థిరీకరించబడుతుందని భావిస్తున్నారు.

# పాదురు శ్రీనివాస్‌రెడ్డి సేవలు ఎనలేనివి : ఎంపీ చామల

నల్గొండ, జూన్ 14: రిటైర్డ్ విద్యాధికారి, దివంగత పాదూరి శ్రీనివాస్ రెడ్డి సేవలు ఎనలేనివని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని చంద్రగిరి విల్లాస్‌లో పాదూరి శ్రీనివాస్‌రెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. శ్రీనివాస్ రెడ్డి మండల విద్యాధికారిగా, ప్రధానోపాధ్యాయుడిగా అనేక సేవలందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు కొనియాడారు. అంతేకాకుండా ఆయన పని చేస్తున్న ప్రదేశాల్లో విద్యాభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పాదూరి ఇంద్రసేనారెడ్డి, వాసుదేవరెడ్డి, మహేందర్ రెడ్డి, గంట్ల వేణుగోపాల్ రెడ్డి, వారి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.






# బంజారా బిడ్డ..మిము మరువదు..ఈ గడ్డ..

## - ఎల్ హెచ్ పిఎస్ నేత భద్రూనాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కు ఘన నివాళులు

## - మదన్ లాల్ సంస్మరణ సభకు హాజరైన పలువురు సామాజిక ఉద్యమకారులు

## - మదన్ లాల్ ఆశయ సాధనకు పాటు పడదామని ప్రతిజ్ఞ

ఖమ్మం, జూన్ 14 (నేటినిజం ప్రతినిధి) :తన చివరి శ్వాస వరకు గిరిజనుల హక్కుల కోసం... గిరిజనుల సంక్షేమం కోసం...వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పరితపించిన మహా నేత, బంజారా ముద్దుబిడ్డ, వైరా మాజీ ఎమ్మెల్యే భానోత్ మదన్ లాల్ అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, సమకాలిన రాజకీయాలకు తీరనిలోటని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్టీఐటీ విద్యా సంస్థల అధినేత ఆర్జెసి కృష్ణ, మదన్ లాల్ సోదరుడు భానోత్ సుందర్ లాల్, డీసిసిబి మాజీ చైర్మన్, బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, మహిళా న్యాయవాది షేక్ నజీమా, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరన్న నాయక్ అన్నారు. శనివారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ బద్రు నాయక్ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన వివిధ సామాజిక సంఘాల ప్రముఖులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు సహా, కవులు, రచయితలు, గాయకులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంగానూ, తాను ఎమ్మెల్యేగా లేకపోయినా ప్రజల అభివృద్ధి కోసం భానోత్ మదన్ లాల్ అలుపెరగని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా సాధారణ పేద కుటుంబం నుంచి వచ్చిన మదన్ లాల్ ఆత్మవిశ్వాసంతో, అంచలంచలుగా ఎదిగి సమాజంలో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి తన జాతి కోసం, తన జాతి సంక్షేమం కోసం శాసనసభలోను శాసనసభ బయట విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, దళిత, బహుజన సామాజిక వర్గాల ఐక్య పోరాటాలకు, ఆయా శ్రేణులకు తీరని లోటని వారన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి అనే చిన్న గ్రామం నుంచి తొలిత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎదిగారని అన్నారు. ప్రజల కోసం చేసిన ఉద్యమాల ఫలితంగా తాను కేసులపాలై సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని సైతం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించి కూడా ప్రజల కోసం పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది అని గుర్తు చేశారు. తను ప్రాతినిధ్యం వహిస్తున్న వైరా నియోజకవర్గంలో పాటు తను పుట్టి పెరిగిన రఘునాథపాలెం మండలాన్ని సైతం అన్ని విధాలుగా సమగ్ర అభివృద్ధి చేసిన ఘనత బానోత్ మదన్ లాల్ దే అని అన్నారు. ఖమ్మం నగరం నడిబొడ్డున బంజారా భవన్ నిర్మాణానికి స్థల సేకరణ లోను, భవన నిర్మాణాన్ని చేపట్టడంలోనూ మదన్ లాల్ ఎంతో కృషి చేశారని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను, ఆయన ఆలోచనలను ప్రజలలోకి తీసుకెళ్లి ఆయన గురించి చైతన్

# బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన బాణోత్ మంజుల మదన్ లాల్

ఖమ్మం, జూన్ 14 (నేటినిజం ప్రతినిధి) : వైరా శాంతినగర్ కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఎక్కిరాల వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వర్లుకు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ 2 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కును మంజూరు చేసింది. శనివారం ఆ చెక్కును ఖమ్మంలో స్వర్గీయ వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ నివాసం నందు బాణోత్ మదన్ లాల్ సతీమణి బాణోత్ మంజుల మదన్ లాల్ బాధిత కుటుంబ సభ్యులకు 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ తన్నీరు జ్యోతి, కొత్తా వెంకటేశ్వరావు, కిలారి కిరణ్, అమ్ము సురేష్, మేదరమేట్ల రాము, తన్నీరు కిషోర్, ప్రేమ్, నల్లబొలు వెంకట రెడ్డి, తదితరులున్నారు.

# గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం..జువ్వాడి నర్సింగరావు

కరీంనగర్, జూన్ 14:ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర సహకార శాఖ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కెఎంఆర్ గార్డెన్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన 720 మంది లబ్ధిదారులకు శనివారం మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సర్కార్ పనిచేస్తుందని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్ అంతడ్పుల పుష్పలత, మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస రెడ్డి, నల్ల బాపురెడ్డి, సిరిపురం రవీందర్, నల్ల రాజన్న, కొటగిరి ఆనంద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి దార్శనిక నాయకత్వంలో, భారతదేశం ప్రీమియం గ్లోబల్ విద్యను సరసమైన ధరకు అందుబాటులోకి తెస్తోంది: శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 14:జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 లో ఊహించిన విధంగా విద్య యొక్క అంతర్జాతీయీకరణ లక్ష్యాలను సాధించే దిశగా విద్యా మంత్రిత్వ శాఖ ఒక పెద్ద అడుగు వేసింది. ముంబైలో జరిగిన 'ముంబై రైజింగ్: క్రియేటింగ్ యాన్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సిటీ' అనే ఉత్సవ కార్యక్రమంలో, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మరియు ఇటలీ నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఐదు విశ్వవిద్యాలయాలకు లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయబడ్డాయి.

యూనివర్శిటీ ఆఫ్ యార్క్, యూనివర్శిటీ ఆఫ్ అబెర్డీన్, యూనివర్శిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా, ఇల్లినాయిస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు ఇన్స్టిట్యూటో యూరోపియో డి డిజైన్ ఇటలీ బ్రాంచ్ క్యాంపస్‌ల స్థాపన భారతదేశ విద్యా పర్యావరణ వ్యవస్థపై లోతైన మరియు పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది మరియు జాతీయ విద్యా విధానం (ఎన్ఇఇ) 2020 యొక్క ఐదు పరివర్తన సంవత్సరాలను మనం గుర్తుచేసుకుంటున్నందున ఇది ఒక ప్రధాన మైలురాయి.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర విద్యా మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, మహారాష్ట్ర ఉన్నత మరియు సాంకేతిక విద్యా మంత్రి శ్రీ చంద్రకాంత్ పాటిల్, మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ అనీమ్ గుప్తా మరియు ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి డ యుజిసి చైర్మన్ డాక్టర్ వినీత్ జోషిల సమక్షంలో LOIల ప్రదానం జరిగింది.

LOIల త్వరిత జారీ ప్రభుత్వ వేగం మరియు నిబద్ధతను ప్రతిబింబిస్తుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత విద్యా రంగంలో భాగం కావడానికి వీలు కల్పించే ఔఇఇ 2020కి ప్రధానమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఐదు విశ్వవిద్యాలయాలు, రాష్ట్రానికి అపారమైన విలువను జోడించాయని మరియు ఎన్ఇఇ 2020 నిజంగా అగ్రశ్రేణి ప్రపంచ సంస్థలకు భారతదేశంలో క్యాంపస్‌లను స్థాపించడానికి ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. విదేశీ విద్యను అభ్యసించడంలో ప్రాప్యత మరియు ఆర్థిక స్థోమత సమస్యలను ఎదుర్కొన్న ప్రతిభావంతులైన భారతీయ విద్యార్థులు ఇప్పుడు భారతదేశంలో తక్కువ ఖర్చుతో అలా చేయగలరని ఆయన పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రపంచ స్థాయిలో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం అని, మరో 5 విశ్వవిద్యాలయాలతో తదుపరి చర్చలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర విద్యా మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, 2020 ఎన్ఇపి భారతదేశాన్ని ఒక ప్రపంచ అధ్యయన గమ్యస్థానంగా, సరసమైన ధరకు ప్రీమియం విద్యను అందించాలని భావిస్తోంది. ఈ చొరవతో, భారతదేశాన్ని ప్రపంచ జ్ఞాన కేంద్రంగా ఉంచాలనే గౌరవనీయ ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేసుకోవడమే మా లక్ష్యం అని ఆయన అన్నారు. భారతదేశం అగ్రశ్రేణి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను ఇక్కడ క్యాంపస్‌లను స్థాపించమని ప్రోత్సహిస్తోంది, అదే సమయంలో భారతీయ ఉన్నత విద్యా సంస్థలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి సాధికారత కల్పిస్తోంది.

ఈ చొరవ ఆలోచనలు, ప్రతిభ మరియు విశ్వాసం యొక్క పెరుగుతున్న ద్విముఖ ఉద్యమాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. భారతదేశం ప్రపంచ విద్యా పర్యావరణ వ్యవస్థలో పాల్గొనడం మాత్రమే కాదు; మేము దానిని రూపొందిస్తున్నాము. ఎంటర్‌ప్రైజ్ మరియు మేధస్సులో మహారాష్ట్ర నాయకత్వం మరియు ఆర్థిక మరియు సాంకేతికత విద్య మరియు పరిశోధనలను కలిసే నగరంగా ముంబై/నవి ముంబై అభివృద్ధి చెందుతుందని శ్రీ ప్రధాన్ అన్నారు. మేము విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం లేదు; ఆవిష్కరణ, వ్యవస్థాపకత మరియు పరిశోధన యొక్క పర్యావరణ వ్యవస్థలను సహ-సృష్టిస్తున్నామని ఆయన అన్నారు. ఎన్ఇపి 2020 అమలులోకి వచ్చి ఐదు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా, ఈ మైలురాయి సంకల్ప సే సిద్ధి స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తుంది, ఇది సంకల్పం నుండి సాక్షాత్కారం వరకు ప్రయాణం. యువతకు సాధికారత కల్పించడం మరియు విద్య ద్వారా ఆవిష్కరణ ఆధారిత వృద్ధిని సాధించడం అనే మా ఉమ్మడి లక్ష్యాన్ని బలోపేతం చేస్తుంది, ఇది విక్షిత్ భారత్‌కు దారితీస్తుంది.

# లోక్ అదాలత్ లతో సమ న్యాయం.. జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్

కరీంనగర్, జూన్ 14:రాజీ మార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్ లతో ఇరువర్గాలకు సమ న్యాయం అందుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు అవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని, రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోవచ్చనీ, తద్వారా ఇరువర్గాలకు సమ న్యాయం అందుతుందని అన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాల వల్ల భవిష్యత్తు కోల్పోతారని, వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు లోక్ అదాలత్ లలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ లో పలు క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, సివిల్ కేసులకు సంబంధించిన 467 కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి భోయిని భూమయ్య, ఏజీపి దూడం ఆంజనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు, చీకటి సంతోష్ కుమార్, న్యాయవాదులు పబ్బతి లక్ష్మీకాంత రెడ్డి, ఆవుల లక్ష్మి రాజం, వొడ్నాల రవీందర్, ఆవునూరి సత్యనారాయణ, జోగుల రమేష్ లతో పాటు పలువురు న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ దేవస్థానం గోశాలలో సిబ్బంది నియామకాలకు ఇంటర్వ్యూలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 14:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకానికి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడ సమీపంలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియమాకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు.

ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయని వివరించారు.

# లైసెన్సులు, హెల్మెట్ లేకుంటే జరిమానా - ఏటూరు నాగారం ఎస్ఐ

వరంగల్, జూన్ 14: ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, తమ వాహనాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్థానిక ఎస్సై రాజ్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ వాహనదారులను హెచ్చరించారు. నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏటూరు నాగారం మండలంలోని అన్ని గ్రామాల ప్రజల ద్విచక్ర వాహనదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం కూడా తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం చేయడం వాహనాలకు సంబంధించిన కాగితాలు లేకపోవడం, హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం తగదన్నారు. తాము ఆదివారం నుంచి నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకుని జరిమానా విధించి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

# నృసింహుని భక్తులందరికీ లడ్డూ ప్రసాదం

## -వారంలో ఆరు రోజులు పులిహోర పంపిణీ

### -ప్రతి శనివారం లడ్డూ ప్రసాదం.. ట్రయల్ రన్ ప్రారంభించిన ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో మాదిరిగా భక్తులందరికీ శ్రీ స్వామి వారి ప్రసాదం పంపిణీ చేసే కార్యక్రమానికి శనివారం యాదగిరిగుట్ట శ్రీ నరసింహ స్వామి దేవస్థానం శ్రీకారం చుట్టింది. ట్రయల్ రన్ గా 100 కిలోల లడ్డూ ప్రసాదం పంపిణీని మధ్యాహ్నం ఆరగింపు దర్శనానంతరం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు స్వయంగా అనువంశిక ధర్మకర్త బి నరసింహ మూర్తి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఆరు రోజులు పులిహోర, శనివారం లడ్డూ ప్రసాదం పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుంది

హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ).కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుందని అన్నారు.

ఈ మేరకు శనివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో జరుగుతున్న నష్టాల మీద రాష్ట్ర బిజెపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నష్టాలపై ఎలాంటి కమిషన్లు వేయదని.. విచారణ కూడా చేయదన్నారు. శ్రీశైలం సొరంగం కూలినా.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలి నా.. పట్టెం పంప్ హౌస్ మునిగి నా.. కేంద్రం ఎందుకు కమిషన్లు పంపడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. వాటి మీద విచారణ కు రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు డిమాండ్ చేయరని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# ఎపి జల దోపిడికి బిజెపి పూర్తి మద్దతు: హరీష్ రావు

హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్ జల దోపిడికి పాల్పడుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎపి నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ బిజెపి నేతలు ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్ లో బనకచర్ల ప్రాజెక్టుపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

ఎపి జల దోపిడికి బిజెపికి పూర్తి మద్దతు తెలుపు తుందన్నారు.

న్యాయబద్ధంగా రెండు రాష్ట్రాలకు కేంద్రం నీళ్లు పంచాలని.. కాని ఎపికి బిజెపి మద్దతు తెలుపుతుందని చెప్పారు.

పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే నియంత్రించాల్సిన కేంద్రం.. నిధులిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తుందని హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రం నుండి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డికి, బండి సంజయ్.. ప్రధాన మంత్రితో మాట్లాడి ఎపి నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఎపి జల దోపిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం నిర్వహించాలన్నారు. అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి బనకచర్లను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని.. లేకపోతే, బిఆర్ఎస్ ప్రజా పోరాటానికి, న్యాయ పోరాటానికి శ్రీకారం చుడుతుందని హరీష్ రావు అన్నారు.

# గ్యాస్ సమస్యతో సతమతం అవుతున్నారా .ఈ చిట్కాలు పాటించండి.



హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)ల;గ్యాస్ ట్రబుల్ సమస్య ప్రస్తుతం చాలా మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వారికి మాత్రమే గ్యాస్ అధికంగా ఉత్పత్తి అయ్యేది. ఎందుకంటే వారు శారీరక శ్రమను తగ్గించేవారు కనుక. కానీ ఇప్పుడు అసలు శారీరక శ్రమ ఉండడం లేదు. దీంతో చిన్నారుల్లో సైతం గ్యాస్ ట్రబుల్ సమస్య వస్తోంది. మహిళలు కూడా పెద్ద ఎత్తున గ్యాస్ సమస్యతో సతమతం అవుతున్నారు. దీంతో నలుగురిలో ఉన్నప్పుడూ చాలా ఇబ్బంది పడుతున్నారు. అయితే గ్యాస్ ట్రబుల్ సమస్య తగ్గేందుకు చాలా మంది మెడికల్ స్టోర్‌కు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. కానీ ఆ అవసరం లేదు. పలు ఇంటి చిట్కాలను పాటిస్తే చాలు, గ్యాస్ సమస్య ఇట్టే తగ్గిపోతుంది. అందుకు గాను ఏం చేయాలో ఇప్పుడు చూద్దాం.

సోంపు గింజలు..

గ్యాస్ సమస్య ఉన్నవారు భోజనం చేసిన అనంతరం కచ్చితంగా గుప్పెడు వోతాదులో సోంపు గింజలను నోట్లో వేసుకుని నమిలి తింటుండాలి. సోంపు గింజల్లో కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ గింజలు జీర్ణ వ్యవస్థలో అధికంగా ఉండే గ్యాస్‌ను సులభంగా బయటకు పంపుతాయి. జీర్ణాశయ కండరాలను ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి. సోంపు గింజలను తినలేం అనుకుంటే వాటిని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను కూడా తాగవచ్చు. అయితే భోజనం చేసిన తరువాత 30 నిమిషాలు ఆగి ఈ నీళ్లను తాగాలి. అదే సోంపు గింజలు అయితే భోజనం చేసిన వెంటనే తినవచ్చు. ఇక అల్లం కూడా జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. భోజనానికి ముందు చిన్న అల్లం ముక్కను తినాలి. లేదా అల్లం రసం సేవించవచ్చు. భోజనం

# ఈ 16న చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద రాస్తారోకో : ధూళిపాల ధనుంజయనాయుడు

నల్గొండ, జూన్ 14: స్థానిక వాహనదారులకు ఉచిత ప్రయాణం కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టోల్‌గేట్ యాజమాన్య వైఖరికి నిరసనగా ఈ నెల 16న చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద రాస్తారోకోను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాల ధనుంజయ నాయుడు తెలిపారు. రాస్తారోకోను పార్టీలకు అతీతంగా జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జరిగిన వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల సమావేశంలో ధనుంజయనాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో అనేకచోట్ల టోల్‌గేట్ పరిధిలోని 20 కిలోమీటర్ల వరకు వాహనదారులకు ఉచిత ప్రయాణం కల్పించాల్సి ఉండగా యాజమాన్యం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, బీఆంఎస్ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు సరికొప్పుల నాగేశ్వ రావు, ఏఐవైఎఫ్ జల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఎమార్పీఎస్ మండ లాధ్యక్షుడు యడవల్లి అరుణ్, ఏఐటీ యూసీ మండల అధ్యక్షుడు ఊద ర వెంకన్న, యడవల్లి వెంకటకృష్ణ, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, ఏఐవై ఎఫ్ పట్టణ అధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

# రక్తదానం మహాదానం : రాముద్రి గోవింద రావు

బొబ్బిలి జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రమాదానికి వ్యక్తి రక్తనీ పంచడం పునర్జన్మకు చల్లని దీవెనలాంటిదని, ప్రజా సంకల్ప వేదిక చైతన్య కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాముద్రి గోవింద రావు అన్నారు.ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ప్రాణ రక్షణ సామాజిక సేవ విశి క్షణ ఇలా మానవ ప్రాణ దాతలు సాటి మనిషి తన వంతు భాధ్యతగా గుర్తి ంచాలన్నారు. అలుపెరగని స్పృహ తో విదిగా పాటించి రక్త దాత దినోన త్సవం జరుపుకొని ప్రతి ఒక్కరిలో నూతనోత్సవం నింపాలని, ప్రపంచ రక్తదాతకు వందనం తెలిపారు.




# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలి

**-బ్రాహ్మణ పరిషత్ పాలకమండలిలో శ్రీ వైష్ణవులకు 50 శాతం డైరెక్టర్ పదవులు కేటాయించాలి**
**-తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆవిర్భావం సమావేశం లో డిమాండ్**
**-తెలంగాణ శ్రీ వైష్ణవ జేఏసీ కన్వీనర్ గా పీచర కృష్ణ ,**
**-తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం కన్వీనర్ గా డింగరి రవి**

హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆవిర్భావ సమావేశం ఎస్ వి జి ట్రస్ట్ ఎల్బీనగర్ హైదరాబాదులో జరిగింది ఈ




సమావేశానికి 28 జిల్లాల ప్రతినిధులు హాజరైనారు జూన్ 1న జరిగిన శ్రీ వైష్ణవ సేవా సమితి తెలంగాణ ఎన్నికలలో జరిగిన అక్రమాలు అవకతకలపై మరియు ఒంటెత్తు పోకడలపై సమావేశం తీవ్ర నిరసనను తెలిపింది రాష్ట్రంలో శ్రీ వైష్ణవుల సంక్షేమానికై గాను గ్రామ మండల జిల్లా స్థాయిలో సభ్యత్వాలు సేకరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహించుకోవాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సంఘం నిర్మాణానికై పటిష్టతకై రాష్ట్ర శాఖకు తెలంగాణ శ్రీ వైష్ణవ జేఏసీ కన్వీనర్ గా పీచర కృష్ణ ను, తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం కన్వీనర్ గా డింగరి రవి లను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కన్వీనర్స్ తో పాటు 20 మంది సభ్యులను వెంకటాచారి, తిరువరంగం ప్రభాకర్,రవి కిరణ్, అరుణ, పవన్ కుమార్, సిహెచ్ రమణ, కృష్ణమాచార్యులు, వామలై వాపు రంగాచార్య, డింగరి మధు తదితరులు ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో యాదగిరి ఆచార్యులు లక్ష్మీనాథ ఆచార్యులు రామాచార్యులు తదితర పెద్దలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియామకం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నూతనంగా నియామకం చేసే బ్రాహ్మణ పరిషత్ పాలకమండలిలో శ్రీ వైష్ణవులకు 50 శాతం డైరెక్టర్ పదవులు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. దేవాదాయ శాఖలో రాష్ట్రవ్యాప్త ఆలయాలు ఆలయాల్లో సేవలందిస్తున్న అర్చక ఉద్యోగులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడం పట్ల సమావేశం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ గృహాలలో శ్రీ వైష్ణవులకు అందిస్థాయిలో 10 శాతం ఇండ్లు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. కన్నప్ప సినిమాలో పిలక గిలక సన్నివేశాలను తొలగించి బ్రాహ్మణ, శ్రీ వైష్ణవులకు మంచు మోహన్ బాబు క్షమాపణ చెప్పాలని సమావేశం డిమాండ్ చేసింది.

# నీట్ -2025 ఫలితాలలో "అల్ఫోర్స్" అఖండ విజయం

**-చైర్మెన్ అల్ఫోర్స్" డా॥ వి. నరేందర్ రెడ్డి**

కరీంనగర్, జూన్ 14:(నేటినిజం ప్రతినిధి) నీట్-2025 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యద్భుత మార్కులు సాధించారు. వి.శశాంత్రెడ్డి 599 మార్కులు సాధించారు. బి. వర్షిత్ 556 మార్కులు, అదిబాపిరోజ్ 553 మార్కులు, జె. మైథిలి 535 మార్కులు, యమ్.డి. అఫ్నాన్ 513 మార్కులు, బి. భువనకృతి 508 మార్కులు, ఏ. సాత్విక 507 మార్కులు, జె. అనూష 500 మార్కులు సాధించారు. చైర్మెన్ అల్ఫోర్స్" డా॥ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ

నీట్ కోచింగ్ లో డాక్టర్-30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ను అందించిన మూడవ సంవత్సరములో అల్ఫోర్స్ విజయపరంపర కొనసాగుతుందన్నారు.

8 మంది విద్యార్థులు 500 అపై మార్కులు సాధించడము విశేషం అన్నారు. సుమారుగా 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలలో సీట్లు సాధించగలరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల అకుంఠిత దీక్ష, పట్టుదల మరియు కృషి వల్ల ఇంతటి ఘన విజయం సాధించడం జరిగిందన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అధికముగా సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనం అన్నారు.

నీట్ అయిన ఐఐటి అయిన విద్యార్థులను విజయమార్గంలో నడిపిస్తున్న సంస్థ అల్ఫోర్స్. ఇంతవరకు ప్రకటించబడిన అన్ని ఫలితాలలో అల్ఫోర్స్ ముందంజలో ఉండడం గమనార్హం అన్నారు.

తెలంగాణ రాష్ట్రములో విద్యాభివృద్ధికై కృషి చేస్తున్న అల్ఫోర్స్ను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ తమ పిల్లలను అల్ఫోర్స్లో చేర్పిస్తున్నందుకు వారికి మన స్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయుచున్నానని పేర్కొన్నారు.

రాబోయే కాలములో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధముగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భముగా తెలియజేయుచున్నానని తెలిపారు. ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ అణీముత్యాలను అభినందిస్తూన్నానని అన్నారు.

ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం

**-ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలి**
**-కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదు.**
**-ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం**
**-ఎన్నికలు జరగకపోవడం వల్ల రూ. 1514 కోట్లు నిధులు నిలిచిపోయాయి.**
**-రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది.**
**-గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి.**
**-ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని**
**-భువనగిరి మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ డిమాండ్**

హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమని, ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలని కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదని భువనగిరి మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం ఎన్నికలు జరగకపోవడం వల్ల రూ. 1514 కోట్లు నిధులు నిలిచిపోయాయి.రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది.గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనిభువనగిరి మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేసారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం. అవి అసెంబ్లీ అయినా కావొచ్చు, పార్లమెంట్ అయినా కావొచ్చు, స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికలైనా కావొచ్చు. ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలని అన్నారు.కాని..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడిచినా, ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో 12,769 మంది సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,717 మంది ఎంపీటీసీల పదవీకాలం 2024 మే నెలలో ముగిసింది. ఇప్పటికీ ఈ స్థానాల్లో ఎన్నికలు జరగలేదు.538 మంది జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్ పర్సన్ల పదవీకాలం కూడా పూర్తయ్యి సంవత్సరం దాటిపోయింది.రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలలో 128 మున్సిపాలిటీల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడిచింది. అయినా ఇప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు.ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలు అనేవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ం, 243-జ, 243-జిం పరిధిలో ఉన్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత మరియు స్టేట్ ఎలక్షన్ కమిషన్ అధీనంలో ఉంటుంది.కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర పరిధిలో ఉన్న అంశం.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోంది.రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి లోకల్ బాడీలకు అభివృద్ధి నిధులు ప్రధానంగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా వస్తాయి.ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావలసిన రూ. 1514 కోట్లు నిధులు ఎన్నికలు జరగకపోవడం వల్ల నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది.అంతేకాక, గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి. ఇవి కూడా ఎన్నికల నిర్వహణ లేకపోవడం వల్ల విడుదల కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది.ఎన్నికల్లో రిజర్వేషన్ నిష్పత్తి నిర్ణయించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆ ప్రక్రియను అమలు చేస్తుంది.రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఎలా ఉండాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కానీ ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడంలో విఫలమవుతోంది.అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ గొప్పగా మాటలు చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.కానీ ఆ హామీలు ఎటూ తీరకపోవడం, ఎన్నికలు జరగకపోవడం వల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను చూపిస్తున్నాయి.అందువల్ల తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి, రాష్ట్రం నష్టపోకుండా చూడాలి.ఆర్టికల్ 243 (జ), 243 (జి), 243 (ం) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హక్కు, బాధ్యత. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదు.గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తే, రాష్ట్రంలో ఎన్నికలు జరగకపోవడం వల్ల ఆ నిధులు పూర్తిగా వినియోగం కావడం లేదు.రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎంత ఉండాలో నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్నది ఇంకా అమలు రూపం దాల్చలేదు.బీసీలకు రిజర్వేషన్ పెంచాలంటే 'ట్రిపుల్ టెస్ట్' ప్రకారం ? (1) కులగణన, (2) బీసీ కమిషన్, (3) డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలు చేసి, పబ్లిక్కు వివరాలు మాత్రం వెల్లడించలేదు.ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టాలని చూడటం తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు.. ఇప్పటికైనా రాష్ట్రంలో బీసీ కులాల గణాంకాలను ప్రచురించాలని, రిజర్వేషన్లను అమలు చేసి ఎన్నికల తక్షణమే నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది.ఈ పరిస్థితుల్లో, ప్రతి రోజూ ఒక మంత్రి "ఇప్పుడు జరుగుతాయి", "తొందర్లో ఉంటాయి", "సంక్రాంతికి జరుగుతాయి" వంటి ప్రకటనలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచి రోజులు రాబోతున్నాయి, తెలంగాణ ప్రజలకు శుభవార్త రాబోతోంది అంటూ చెవిలో పూలు పెడుతున్నారు. కానీ వాస్తవంగా ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం లేదనే సంగతి స్పష్టమవుతోంది.అసలు సామాజిక న్యాయం గురించి మాట్లాడే రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉందా?రాహుల్ గాంధీ నిత్యం కులగణన గురించి మాట్లాడుతారు. కానీ అదే కాంగ్రెస్ పాలనలో ఉన్న కర్ణాటకలో 3 సంవత్సరాల క్రితమే కులగణన పూర్తయింది. ఇప్పటివరకు ఆ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదు?కులగణన సరిగ్గా చేయలేకపోయాం, మళ్ళీ మొదలుపెడతాం అని చెబుతుండటమంటే.. మళ్ళీ ఎన్నికల సమయం వచ్చేంతవరకూ ప్రాసెస్ను లాగేస్తారా? ఇది ప్రజల్ని మోసం చేయడమే.గత 60 ఏళ్లలో దాదాపు 50 ఏళ్లు కాంగ్రెస్ పాలించింది. ఒక్కసారి అయినా బీసీని ముఖ్యమంత్రిగా చేసిందా? అని నర్సయ్య గౌడ్ ప్రశ్నించారు.తెలంగాణలో ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఒక్క బీసీని ఉపముఖ్యమంత్రిగా కూడా చేయలేకపోయింది.తెలంగాణలో కాంగ్రెస్ మంత్రివర్గంలో 14 మందిలో కేవలం ముగ్గురు మాత్రమే బీసీలు. అదే కేంద్ర మంత్రివర్గంలో 60% మంత్రులు ఎస్సీ, ఎస్టీ, బీసీలే.బిజెపి దేశంలో మొదటి సారి ఓ బీసీని ప్రధానిగా చేసింది. కానీ కాంగ్రెస్ చరిత్రలో అసలు సామాజిక న్యాయానికి చోటే లేదు. కాంగ్రెస్ పార్టీకి కులగణన ప్రక్రియ ఒక రాజకీయ ఆయుధంగా మారింది. హిందూ సమాజాన్ని చీల్చి, ఓట్ల కోసమే ఈ కులగణన నాటకం.రాహుల్ గాంధీ ఏదైనా మాట్లాడితే, అదే మాటలను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిరోజూ పునరావృతం చేస్తున్నారు. కానీ అనుసరించాల్సిన చర్యలు మాత్రం కనిపించడం లేదు.ప్రతిరోజూ ప్రజలకు తీపి కబురు అన్న పేరుతో పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయి. కానీ ఆ వాగ్దానాల అమలు మాత్రం లేదు. కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. 15,000 ఇస్తామని హామీ ఇచ్చింది. కాని ఇప్పటివరకు ఇచ్చింది తక్కువే.మూడు పంటల కాలానికి దాదాపు రూ. 33,750 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు ఇచ్చింది కేవలం రూ.3,000 కోట్లలోపే.రైతు కూలీలకు వాగ్దానం చేసిన రూ.12,000 కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు.కౌలు రైతులపై చట్టం లేదు, సర్వే లేదు. సుమారు 30-35 లక్షల మంది కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.వారికి బోనస్ లేదా కనీస హక్కులు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు.వరదలు లేదా వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వం స్పందించట్లేదు.ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలకే అంటూ మంత్రులే వ్యాఖ్యలు చేస్తుండటం దుర్మార్గం. ఇది ప్రజాధనాలను పార్టీ పనియోగానికి మళ్ళించడమే.18 నెలల తర్వాత కూడా ప్రభుత్వం ''శాంపుల్ గవర్నమెంట్'' స్థాయిలో ఉంది. మంత్రులు హెలికాప్టర్లలో తిరుగుతూ, అధిష్టానానికి సంచులు పంపడంపైనే దృష్టి పెట్టారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం నిరవేర్చిన హామీల విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వైట్ పేపర్ విడుదల చేయాలి.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలి.అదేవిధంగా రాష్ట్రంలో కులాల సర్వే ఫలితాలను బహిర్గతం చేయాలని బుర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేసారు.

# తల్లులకు చేకూర్చే లబ్ది చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుంది

**-మండిపడ్డ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

అమరావతి జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తల్లులకు చేకూర్చే లబ్ది చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుందని ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. పాఠశాలలు తెరచిన రోజే పుస్తకాలు, నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తల్లికివందనం కింద ఒక్కరోజులో విద్యార్థులకు రూ. 10 వేల కోట్ల లబ్ది ఓ రికార్డు అని అన్నారు. మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైసిపిలో ఒక్కరికైనా ఉందా? అని ప్రశ్నించారు. నిన్నటి దాకా వైసిపి సైకోలు (జఅఖ ఖబఎఇఇ్ఞనీబ) మహిళలను కించపరిచారని, ఇప్పుడు తల్లులు ఆనందంగా ఉండడం చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రంగులు, బొమ్మల పిచ్చితో గత పాలకులు విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# తమ్మిడి హట్టికి బదులుగా మేడిగడ్డ ఎంపిక చేయడమే ముమ్మాటికి రాజకీయ నిర్ణయమే..

**- ప్రజల్ని మోసం చేసినవారిని వదిలిపెట్టేది లేదు : ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**

హైదరాబాద్ జూన్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తమ్మిడి హట్టికి బదులుగా మేడిగడ్డ ఎంపిక చేయడమే ముమ్మాటికి రాజకీయ నిర్ణయమేనని ప్రజల్ని మోసం చేసినవారిని వదిలి పెట్టేది లేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హెచ్చరించారు.శనివారం పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ విచారణ పూర్తయినట్టు ఇటీవల పత్రికల ద్వారా వార్తలు వచ్చాయి. కమిషన్ కాలపరిమితి పొడిగింపుల అనంతరం తుది విచారణ పూర్తయిందని, నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందించబోతున్నట్టు ప్రకటించారు. ఈ తుది విచారణలో పాల్గొన్న వారంతా "క్యాబినెట్ నిర్ణయమే" అంటుండటం గమనార్హం. సాంకేతిక విషయాలు తమకు తెలియవని, నిపుణుల సూచనల ప్రకారమే జరిగిందని పేర్కొన్నారు. ఇది పూర్తిగా క్యాబినెట్ ఉపసంఘం తీసుకున్న నిర్ణయం ఆధారంగా జరిగిందన్న వాదన వల్ల తప్పిదానికి బాధ్యత ఎవరిదన్నది ప్రజలకు స్పష్టంగా తెలియకుండానే మిగిలిపోతోంది. మధ్య మధ్యలో సిడబ్ల్యూసీ పేరు ఎత్తుతూ తప్పించుకోవడానికి కబుర్లు చెప్పినట్టు కనిపిస్తోందన్నారు. చేసిన తప్పును అంగీకరించి ప్రజల ముందు బహిరంగంగా నివేదించి ఉంటే నైతికత కలిగిన నాయకత్వంగా గుర్తింపు పొందేది. కానీ "అనారోగ్యం" అనే కారణంతో బహిరంగ విచారణకు రావడం మానుకుంటూ, ఏకాంతంగా మాట్లాడతాను అని చెప్పిన తీరు ప్రజల్లో అనుమానాలకే దారి తీస్తోంది. ఈ దశలో అసలు ఎవరు ఏం చెప్పాలనుకుంటున్నారు. ఏమి దాచాలనుకుంటున్నారుకాళేశ్వరం పనులు ప్రారంభమైనప్పటి నుంచే సిఏజి వార్షిక నివేదికల ద్వారా ఈ ప్రాజెక్టు ఫీజబుల్ కాదని, వ్యయప్రయోజన సంబంధం లేదు అని అన్నారు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించారని స్పష్టంగా పేర్కొంటూ వచ్చింది. అయినా ప్రభుత్వం చెల్లింపులు కొనసాగించడమే కాక, అక్రమాలకు ఆస్కారం కలిగింది. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ఖంఅ) కూడా ప్రతి సంవత్సరం ఈ ప్రాజెక్టులో జరిగిన తప్పులను, అవకతవకలను ఎత్తిచూపింది. అయినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కసారి కూడా చర్యలు తీసుకోవడం గానీ, లోపాలు సరిచూడడం గానీ జరగలేదు.ప్రతి దానికీ "క్యాబినెట్ నిర్ణయం" అన్నదే నడుస్తోంది. అంటే మేము ఒక్కరే దోచుకోలేదు, క్యాబినెట్ మొత్తమే దోచుకుందన్న అర్థమా.. కాళేశ్వరం కాలువలు కొట్టుకుపోయినట్టు వార్తలు నిజమా కాదా.. కాలువలు కుంగిపోయిన మాట వాస్తవమా కాదా.. బ్యారేజ్కి బీటలు పడటం జరిగిందే కదా.. అని ప్రభాకర్ ప్రశ్నించారు.ఇవన్నీ దేశం మొత్తానికి తెలిసిన విషయాలే. దీని గురించి ముఖ్యమంత్రి నోరు విప్పాల్సిన సమయం ఆసన్నమైంది.తమ్మిడి హట్టికి బదులుగా మేడిగడ్డ ఎంపిక చేయడమే ముమ్మాటికి రాజకీయ నిర్ణయమే. కాంగ్రెస్ ప్రభుత్వం తమ్మిడి హట్టికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. అనంతరం వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం టెండర్లను మార్చకుండా అదే సంస్థలకు మేడిగడ్డ అప్పగించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ఇప్పటికీ వివరణ రావాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో లేదా ఏ రాష్ట్రంలో అయినా ఇన్నిసార్లు అంచనాలు పెరిగిన ప్రాజెక్ట్ను చూసిన దాఖలాలు లేవు. సాధారణంగా ప్రాజెక్టుల ఖర్చు ఎస్కలేషన్ కొన్ని కారణాల వల్ల జరిగితే అది సహజం. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అంచనాలు డబుల్, ట్రిపుల్గా మారిపోయాయి. ఈ విషయంలో పీసీ ఘోష్ సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అంతేకాదు, టెండర్లు పిలవకుండానే అప్పగించడమో, సిఏజీ స్పష్టంగా "జనిటబీవ టజీలనీబీతీ బినీ బిష్వవ ఇనీనిబితీజీఇబినీతీ" అన్న అంశాన్ని ఎత్తిచూపడమో.. ఇవన్నీ అప్పట్లోనే ఆపి, ముఖ్యమంత్రి స్పందించి ఉండాల్సింది. కానీ అప్పుడు స్పందించకపోవడం పెద్ద తప్పిదం.ఇప్పుడు పీసీ ఘోష్ విచారణ ఒక స్కూల్ లో వైవా పరీక్షలా మారింది. ముందుగా ఎవర్ని ఏమి అడుగుతున్నారో చూసి, మూడో వ్యక్తి ప్రిపేర్ అయ్యేలా తయారయ్యే పరిస్థితి కనిపిస్తోందన్నారు.. కనీసం పాస్ మార్కులు కాకపోయినా డీటైన్ కాకూడదనే ప్రయత్నంగా మారింది. అందుకే ఈ విచారణలో పీసీ ఘోష్ రకరకాల కథనాలు చెబుతూ, అన్నీ "క్యాబినెట్ నిర్ణయం" కింద తీసుకురావడం ఆశ్చర్యంగా ఉందన్నారు..కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిన తర్వాత, కాలువలు కొట్టుకుపోయిన తర్వాత, మోటార్లు మొరాయించిన తర్వాత, బ్యారేజ్కు బీటలు వారిన తర్వాత నీరు నిల్వ ఉంచలేమన్న విషయమే ప్రధానంగా చర్చకు వచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే ఈ సమస్యను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి నివేదించారు. ప్రతి రాష్ట్రంలో స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ అప్పటి ప్రభుత్వ కాలంలో, ఈ మేడిగడ్డ గాని, అన్నారం గాని, సుందిల్ల గాని ప్రాజెక్టులకు సంబంధించి, స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి ఒకసారి కూడా విషయాలను తెలియజేయలేదు. వీటి పరిశీలన కోసం విజిట్ చేయాలని కూడా ప్రయత్నించలేదు. అంతా నా వల్లే... పారుతున్న నీళ్లు, పండుతున్న పంట, వస్తున్న దిగుబడి అన్నట్టుగా అప్పటి ముఖ్యమంత్రి చెప్పడం విచారకరమన్నారు..భారతీయ జనతా పార్టీ మొదటి నుండి ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువస్తూ వచ్చింది. కాళేశ్వరం లో జరిగిన అక్రమాలకు సంబంధించి సీబీఐని విచారణకు చేరవేయాలని మా పార్టీ తరఫున అనేకసార్లు కోరాం. ఈడీ రంగప్రవేశం చేయాలని డిమాండ్ చేశాం. ప్రాజెక్టు లో జరిగిన అవినీతిని తేల్చడానికి ఇది అత్యవసరమైన చర్య. అయినా ఇప్పుడు తుది నివేదిక ఏమి ఇస్తుందో చూడాలి. కానీ భారతీయ జనతా పార్టీ మాత్రం కాళేశ్వరాన్ని ఏటీఎంగా వాడుకున్న నాయకులనూ, పార్టీలనూ, అప్పటి ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్న విషయాన్ని చాలా స్పష్టంగా ప్రజల ముందుకు తీసుకువస్తున్నది. మరోవైపు ఏసిబి తన పని తాను చేసుకుంటూ పోతోంది. ఒక్కొక్క అధికారి ఇళ్లల్లో సెర్చ్ చేస్తే, సాధారణ స్థాయిలో కాకుండా, భారీగా అవినీతి, ఆస్తులు, వివరాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన ఇరిగేషన్ ఇంజినీర్ల అవినీతిని ఏసిబి వెలుగులోకి తీసుకొస్తోంది. అప్పటి ప్రభుత్వాధినేతల అవినీతిని కూడా బయటపెట్టాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దు. మేము కోరినట్లు సీబీఐ, ఈడీ రంగప్రవేశం చేయాలన్న డిమాండ్ను మరోసారి గుర్తు చేస్తున్నాం.తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రతి రోజు కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జరిగే సిడబ్ల్యూసీ మీటింగ్, బహిరంగ సభ, పార్టీ కార్యక్రమాల్లో ఒకచేత రాజ్యాంగ పుస్తకం పట్టుకుని "మేము రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఉన్నాం" అని చెప్పడం చూస